

ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం

- కూటమి మేనిఫెస్టోలో ప్రకటన
- రైల్వే జోన్ పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూస్తాం
- ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తాం
- సుజల స్రవంతి పథకానికి నిధులు
- ఉత్తరాంధ్రకు ప్రత్యేకంగా ఎంప్లాయ్‌మెంట్ జోన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖను ఆర్థిక రాజధాని చేస్తామని తెలుగుదేశం, జనసేన, బీజేపీ మేనిఫెస్టోలో ప్రకటించాయి. అలాగే వైసీపీ ప్రభుత్వం భూములు కేటాయించకపోవడం వల్ల ఆగిపోయిన రైల్వే జోన్ పనులను ముందుకు తీసుకువెళతామని తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు వెల్లడించారు. జోన్‌కు తక్షణమే భూములు ఇస్తామని హామీ ఇచ్చారు. 'విశాఖ ఉక్కు...ఆంధ్రుల హక్కు' అంటూ సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు.

ఉత్తరాంధ్రకు ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ జోన్

రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు అభివృద్ధిలో బాగా వెనుకబడ్డాయి. ఇక్కడి వారికి పెద్దగా ఉపాధి అవకాశాలు లేవు. ఈ ప్రాంతాల అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. తాము అధికారంలోకి వస్తే రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని చంద్రబాబునాయుడు ప్రకటించారు. అందులో భాగంగా ఉత్తరాంధ్ర యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రత్యేకంగా ఎంప్లాయిమెంట్ జోన్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌తో ప్రధాన ప్రాంతాలను అనుసంధానం చేసి పారిశ్రామికాభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తామన్నారు.

జనరంజకం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

సంక్షేమానికి పెద్దపీట

- మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాలకు వరాలు
- యువతకు 20 లక్షల ఉద్యోగాలు/నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- ప్రతి రైతుకు ఏటా రూ.20,000 వేలు సాయం
- ప్రతి మహిళకు నెలకు రూ.1,500
- ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మెగా డీఎస్సీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్...
- భూ హక్కు చట్టం, చెత్త పన్ను రద్దు చేస్తామని ప్రకటన
- మత్స్యకారులకు ఏటా రూ.20 వేలు సాయం
- విద్యుత్ చార్జీల భారం మోపబోమని హామీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

యువతకు 20 లక్షల ఉద్యోగాలు/నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి... స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000... ప్రతి రైతుకు ఏటా రూ.20,000 వేలు సాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 (19 నుంచి 59 సంవత్సరాల వరకూ)... ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం... మెగా డీఎస్సీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్... ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ జోన్... బీసీలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4 వేల పెన్షన్... స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణం రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు... చెత్త పన్ను రద్దు, ఇంటి పన్నులపై సమీక్ష... ఉచిత ఇసుక విధానం... ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా కళాశాలలకే చెల్లింపు...

...ఇవీ తెలుగుదేశం, జనసేన పార్టీలు మంగళవారం విడుదల చేసిన మేనిఫెస్టోలో కొన్ని ప్రధాన హామీలు



ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేస్తున్న చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, సిద్ధార్థ్‌నాథ్‌సింగ్





వైసీపీకి ఓట్లు వేయకపోతే...తాము అమలు చేస్తున్న పథకాలన్నీ తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఆపేస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొడుతూ ఇప్పుడున్న వాటిని మరింత మెరుగ్గా అమలు చేస్తూనే అదనంగా సౌకర్యాలు అందిస్తామని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు హామీ ఇచ్చారు. ఇటు సంక్షేమం, అటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు మేలు చేకూరుస్తామని స్పష్టంగా చెప్పారు. దీనిపై అన్నివర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఇది కదా...మేనిఫెస్టో అనే అభిప్రాయం వినిపిస్తోంది.

ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ ఏపీ ఎన్నికల కో-ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్‌లు ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. కూటమి పార్టీలు సుదీర్ఘ కసరత్తు అనంతరం విడుదల చేసిన ఈ మేనిఫెస్టో ప్రజారంజకంగా ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఎన్నికలకు పది నెలల ముందే టీడీపీ 'సూపర్ సిక్స్' పేరుతో తొలివిడత మేనిఫెస్టోను రాజమండ్రిలో ప్రకటించిన సంగతి తెలిసిందే. కూటమిగా ఏర్పడిన తరువాత టీడీపీ, జనసేన, బీజేపీ సుదీర్ఘ కసరత్తు అనంతరం వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలను సేకరించిన తరువాత ఇప్పుడు ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశాయి. అన్ని వర్గాలకు మేలు చేసేవిధంగా మేనిఫెస్టోను రూపొందించాయి.

నిరుద్యోగులకు తీపికబురు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో వేలాది మంది యువతీ యువకులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు తరలిపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రకటనలు ఇవ్వడం లేదు. టీచర్ ట్రైనింగ్ ... మిగతా 8వ పేజీలో

బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ గొప్ప విషయం



బీసీలకు 50 ఏళ్లకే రూ.4 వేల సామాజిక పింఛన్ ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టడం గొప్ప విషయం. దీని వల్ల బీసీ వర్గాలకు ఆర్థికంగా చేయూత లభిస్తుంది. జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

\- కొట్యాడ మల్లికార్జునరావు, మాడుగుల

నిరుద్యోగ భృతి వల్ల ఎంతో ప్రయోజనం



టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి పథకాలు బాగున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వడం మంచిదే. దీని వల్ల నిరుద్యోగులు పోటీ పరీక్షలకు ఫీజులు కట్టుకోవడానికి, చదువుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

\- ఓరుగంటి నాగమణి, నిరుద్యోగి, బలిఘట్టం

ఉచిత బస్సు ప్రయాణం ఓ వరం



తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఒక వరం. ప్రస్తుతం ఆర్టీసీ బస్సు చార్జీలు భారీగా పెరగడంతో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంది. పనుల కోసం నిత్యం అనకాపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లే మహిళలకు ఇది ఎంతో మేలు.

\- కొణతాల జయలక్ష్మి, అనకాపల్లి

మహిళలకు చేయూత



కూటమి మేనిఫెస్టోలో మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు ఏడాదికి రూ.18 వేలు నగదు అందించడంతో గుర్తింపుతో పాటు మహిళల్లో ఆత్మగౌరవం పెరుగుతుంది.

\- సయ్యపురెడ్డి నాగమణి, గృహిణి, వడ్డాది

దివ్యాంగులకు భరోసా



కూటమి మేనిఫెస్టోలో దివ్యాంగుల పింఛను రూ.6వేలకు పెంపు మాకు భరోసా కల్పిస్తున్నది. వందశాతం వైకల్యంతో ఒకరిపై ఆధారపడి జీవనం సాగించే వారికి రూ.15వేలు ఇస్తామనడం దివ్యాంగులకు తగిన గుర్తింపు ఇచ్చినట్టుగానే భావిస్తున్నాం. కూటమికి మా మద్దతు తప్పకుండా ఉంటుంది.

\- శరగడం నాగభూషణం,
దివ్యాంగుల సంక్షేమ సంఘం చోడవరం మండలశాఖ అధ్యక్షుడు

రైతులకు ఊరట



ఏడాదికి రూ.20వేలు రైతులకు సాయంగా టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో ప్రకటించడం మా కష్టాలు గుర్తించినట్టుగానే కనిపిస్తున్నది. పంటల సాగుపరంగా చాలా ఇబ్బందులు, నష్టాలు ఎదుర్కొంటున్నాం. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో భూములను ఖాళీగా ఉంచుతున్నాం. ఇప్పుడు చంద్రబాబు ప్రకటించిన రూ.20వేల హామీతో, వ్యవసాయం చేయగలమన్న ధీమా వచ్చింది.

\- గొర్లె సుధాకర్, రైతు ఎడ్లవీధి, చోడవరం

నేడు పవన్‌కల్యాణ్ రాక

అచ్యుతాపురం, పెందుర్తి జంక్షన్లలో సభలు

- విశాఖలో రోడ్ షో రేపు



విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఆ పార్టీ తరఫున ఎలమంచిలిలో సుందరపు విజయకుమార్, పెందుర్తిలో పంచకర్ల రమేశ్‌బాబు, విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వంశీకృష్ణ శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. వారితో పాటు కూటమి అభ్యర్థులకు మద్దతుగా పలు నియోజకవర్గాల్లో ఆయన ప్రచారం చేయనున్నారు. బుధవారం సాయంత్రం మూడు గంటలకు ఎలమంచిలి నియోజకవర్గ పరిధిలోని అచ్యుతాపురం వెళతారు. అక్కడ సభలో పాల్గొంటారు. ఆ తరువాత సాయంత్రం ఆరు గంటలకు పెందుర్తి జంక్షన్‌లో ఏర్పాటుచేసే సభలో ప్రసంగిస్తారు. రాత్రికి విశాఖపట్నం చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. గురువారం ఉదయం పాలకొండ వెళ్లి అక్కడ ప్రచారం నిర్వహిస్తారు. సాయంత్రానికి తిరిగి విశాఖపట్నం చేరుకొని నగరంలో రోడ్ షో చేస్తారు. మొదట విశాఖ దక్షిణ నియోజక వర్గంలో, ఆ తరువాత కూటమి అభ్యర్థులు విష్ణుకుమార్‌రాజు, గణబాబులు పోటీ చేస్తున్న ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలు కలిసే ఉండే ప్రాంతాలు, ఆ పై గాజువాక వెళ్లి అక్కడ పల్లా శ్రీనివాసరావు తరఫున ప్రచారం నిర్వహిస్తారని సమాచారం. పార్టీ తరఫున ఈ పర్యటనకు సంబంధించి ఎటువంటి ప్రకటన జారీ చేయకపోవడం గమనార్హం.

నిప్పుల కుంపటి

- అత్యధికంగా రావికమతంలో 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం అత్యధికంగా రావికమతంలో 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చీడికాడ, దేవరాపల్లిలో 44.2, గొలుగొండలో 43.5, బుచ్చెయ్యపేటలో 43.2, చోడవరం, మాడుగుల, రోలుగుంటలో 42.6, కె.కోటపాడులో 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

జగన్ హామీలు నీటి మూటలే..

గత ఎన్నికల సమయంలో ఎన్నో వాగ్దానాలు

- అధికారంలోకి వచ్చాక నెరవేర్చని వైనం
- నేడు అదే చోట సీఎం ఎన్నికల సభ
- పాతవి వదిలేసి.. కొత్తగా ఏం చెబుతారని జనం పెదవివిరుపు

పాయకరావుపేట, ఏప్రిల్ 30:

'తాండవ, ఏటికొప్పాక సహకార చక్కెర కర్మాగారాలను ఆదుకుంటాం. లాభాల బాటలో నడిచేలా చర్యలు తీసుకుంటాం. నక్కపల్లి మండలంలో పరిశ్రమల కోసం సేకరించిన భూములకు ఇవ్వాల్సిన నష్టపరిహారం చెల్లిస్తాం. రాజియ్యపేట, పెంటకోట వద్ద మత్స్యకారుల కోసం జెట్టీలు నిర్మిస్తాం'.. ఇవీ గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు. అయితే అధికారంలోకి వచ్చాక ఈ హామీలను మరిచిపోయారని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గత ఎన్నికల సమయంలో పాయకరావుపేట సూర్యామహల్ జంక్షన్‌లో వైఎస్ జగన్ ప్రసంగిస్తున్నప్పటి చిత్రం

గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాయకరావుపేట వచ్చిన సందర్భంగా ఇచ్చిన ఎన్నికల హామీలు ఆయన అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా చాలా వరకు నెరవేర్చలేదు. 2019 మార్చి 27న పాయకరావుపేట వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పట్టణంలో తాజాగా బుధవారం ఎన్నికల సభ నిర్వహించనున్న ప్రదేశంలోనే రోడ్డు షో నిర్వహించారు. అక్కడ ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని తాండవ, ఏటికొప్పాక సహకార చక్కెర కర్మాగారాలు చెరకు సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు, కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉన్నాయని, ఫ్యాక్టరీలు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి మూతపడే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతుల బకాయిలు, కార్మికుల జీతాలు వెంటనే చెల్లించడంతోపాటు ఫ్యాక్టరీలను ఆర్థికంగా ఆదుకుని లాభాల బాటలో నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తే 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్.జగన్ ప్రభుత్వం సహకార చక్కెర కర్మాగారాల స్థితిగతులను తెలుసుకునేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ వేశారు తప్ప ఆర్థికంగా ఆదుకునేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. చెరకు సరఫరా చేసిన రైతులకు రెండేళ్ల తరువాత పేమెంట్లు చేసిన ప్రభుత్వం కార్మికుల జీతాల బకాయిల చెల్లింపులను పట్టించుకోలేదు. దీంతో గత మూడేళ్లుగా ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిచిపోయి కార్మికులు రోడ్డున పడ్డారు. నక్కపల్లి మండలంలో పరిశ్రమల కోసం సేకరించిన భూములకు ఇవ్వాల్సిన నష్టపరిహారం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తామని జగన్ చెప్పినా ఇప్పటికీ చెల్లించలేదు. తీర ప్రాంతంలో రాజియ్యపేట, పెంటకోట వద్ద మత్స్యకారుల కోసం జట్టీలు నిర్మాణానికి ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. కాగా బుధవారం సీఎం హోదాలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు పాయకరావుపేట వస్తున్న జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై వివరణ ఇస్తారా?, లేక మళ్లీ కొత్తగా హామీలు ఇస్తారో చూడాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.

నేడు పాయకరావుపేటలో సీఎం జగన్ పర్యటన



అనకాపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాకు రానున్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఉదయం 11 గంటలకు జరిగే ఎన్నికల ప్రచార సభకు హాజరై మధ్యాహ్నం 12 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు పాయకరావుపేట చేరుకుంటారు. రెండు గంటలకు పాయకరావుపేట సూర్యామహల్ జంక్షన్‌లో జరిగే సభలో సీఎం జగన్ ప్రసంగిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి ఏలూరు వెళతారు.

కూటమి అభ్యర్థులకు షుగర్ ఫ్యాక్టరీల కార్మికుల మద్దతు

పాయకరావుపేట, ఏప్రిల్ 30:

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున పోటీ చేస్తున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్టు తాండవ, ఏటికొప్పాక సహకార చక్కెర కర్మాగారాల కార్మిక నాయకులు ప్రకటించారు. మంగళవారం పాయకరావుపేటలోని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పార్టీ కార్యాలయంలో సీఎం రమేశ్ సోదరుడు సురేశ్‌తో సమావేశమైన కార్మికులు తమ సమస్యలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలవడం ఖాయమని, గత ఐదేళ్లుగా జీతాల బకాయిలు అందక తాము ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండవ, ఏటికొప్పాక చక్కెర కర్మాగారాల కార్మికుల సంఘాల నాయకులు కర్రి శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎన్‌టీ సీతారామమూర్తి, యు.రామచంద్రరాజు, జి.గోవిందరాజు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో చక్కెర కర్మాగారాల కార్మికులతో సమావేశమైన సీఎం రమేశ్ సోదరుడు సురేశ్

అభ్యర్థులకు ఎన్నికల నియమావళిపై అవగాహన అవసరం

నిబంధనలు విస్మరిస్తే చర్యలు తప్పవు

- ఎన్నికల పరిశీలకుడు దర్జిత్‌సింగ్ మంగత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు దర్జిత్‌సింగ్ మంగత్ తదితరులు

అనకాపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల పరిశీలకుడు దర్జిత్‌సింగ్ మంగత్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో బరిలో ఉన్న ఎంపీ అభ్యర్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలను అనుసరించి స్వేచ్ఛాయుత వాతావరణంలో పోటీచేసి ప్రతి అభ్యర్థి ప్రచారం నిర్వహించుకోవచ్చన్నారు. ఎవరిపైనా దుష్ప్రచారం చేయకూడదని, ప్రార్థనా స్థలాలు, మతపర ప్రదేశాలు ప్రచారానికి నిషిద్ధమని తెలిపారు. ప్రచార సామగ్రి, వాహనాలు మొదలైన వాటికి ముందుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వ్యయ పరిశీలకుడు గోపాలస్వామి మాట్లాడుతూ అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలని సూచించారు. ఆయా ఖాతాల ద్వారా మాత్రమే ప్రచార వ్యయ లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. అభ్యర్థుల ఖర్చుకు సంబంధించి మూడు పర్యాయాలు తనిఖీలు జరుగుతాయన్నారు. నిర్దేశించిన సమయంలో అకౌంట్స్ అధికారికి వివరించాలన్నారు. రూ.10 వేల వరకు నగదు చెల్లింపులు చేయాలని, అంతకు మించితే బ్యాంకు చెక్, అకౌంట్ పే ద్వారా జరపాలని సూచించారు. ప్రచార సామగ్రికి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్నన్‌శెట్టి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరికీ సమాన హక్కులు ఉంటాయని, బాధ్యతలు ఉంటాయన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏ విషయాన్నైనా సంబంధిత అధికారుల నుంచి పొందవచ్చునన్నారు. ఈ సమావేశంలో పోలీసు పరిశీలకుడు డాక్టర్ రాకేశ్‌కుమార్, అనకాపల్లి పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు, ఎన్నికల విభాగాల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

జన కేతనం

- ఎదుగూ బొదుగూ లేని విశాఖ
- మొదటి ముఖ్యమంత్రికి పట్టం కట్టిన జిల్లా! అక్కడ వరుసగా రెండోసారి
- గెలుపొందడం కష్టమే

- 7లో

ప్రజల ఆస్తులను దోచుకునే భూ యాజమాన్య చట్టం

» టీడీపీ నాయకుడు దాడి వీరభద్రరావు


దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 30: ప్రజల ఆస్తులను దోచుకునే చట్టమే వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న భూ యాజమాన్య చట్టమని మాజీ మంత్రి, టీడీపీ కేంద్ర ఎన్నికల సంఘం మీడియా సమన్వయకర్త దాడి వీరభద్రరావు అన్నారు. స్థానిక డీవీఆర్ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇది ప్రజాస్వామ్యమా లేదా ఎమర్జన్సీ నా, సీఎం చక్రవర్తా అని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వ భూములు కబ్జా చేశారన్నారు. ప్రజల ప్రైవేటు ఆస్తులను కబ్జా చేయడానికే ఈ చట్టం అమల్లోకి తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రజలతో సంప్రదించి చట్టాన్ని అమలు చేస్తామని మాజీ ఐఏఎస్ అధికారి అజయ్‌కల్లాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెబుతుండడం చూస్తుంటే ప్రజలను వెర్రివాళ్లగా చూస్తున్నారన్నారు. తక్షణమే చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కావాలన్నారు. ప్రజల సొంత ఆస్తులను దోచుకోవడానికి ఈ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. చట్టం అమలు కాలేదని అధికారులు ఎన్నికల కమిషన్‌కు చెప్పడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమన్నారు. 2023 అక్టోబరు 31న జీవో నంబరు 512ను విడుదల చేశారని, ఇంతకంటే ఏమి కావాలన్నారు. సివిల్ కోర్టులు కూడా దీనిపై కేసులు తీసుకోవడం మానివేశాయన్నారు. జీవోకు వ్యతిరేకంగా న్యాయవాదులు నెల రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల పైకి వచ్చి ధర్నా చేశారన్నారు. చట్టాన్ని అమలు చేయకుంటే అజయ్‌కల్లామ్ వంటి సీనియర్ ఐఏఎస్ అధికారి రోడ్డు పైకి పంపి ఆయనతో అబద్ధాలు చెప్పిస్తున్నారని దాడి ఆరోపించారు. చట్టం అమలు జరగనప్పుడు జీవోను రద్దు చేశారా అని ఆయన ప్రశ్నించారు. భూమి మీద ఉన్నట్టు వంటి ఏ ఆస్తి అయినా పంట భూమి, అపార్టుమెంట్, పరిశ్రమ కావచ్చనని ఈ చట్టంలోకి వస్తుందన్నారు. ప్రైవేటు ఆస్తులను కబ్జా చేయడానికే ఈ చట్టమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేస్తారనే భయం జగన్‌లో పుట్టుకుందని అందుకే అధికారులతో డ్రామాలు ఆడిస్తున్నారని దాడి వీరభద్రరావు ఆరోపించారు.

వైసీపీ మేనిఫెస్టోలో దివ్యాంగులకు అన్యాయం

» దివ్యాంగ హక్కుల పోరాట సమితి కన్వీనర్ గంజి శ్రీనివాస్


గంజి శ్రీనివాస్

రావికమతం, ఏప్రిల్ 30: వైసీపీ మేనిఫెస్టోలో దివ్యాంగుల పెన్షన్ల పెంపుపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఊసేఎత్తలేదని, ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో ఆపార్టీకి దివ్యాంగులు ఓటుతో బుద్ధి చెప్పాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నియోజక వర్గ కన్వీనర్ గంజి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రోజు రోజుకు నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేలకు పింఛన్ పెంచుతుందని ఎంతో ఆశతో ఎదురుచూశామని చివరికి నిరాశే ఎదురైందన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమితోపాటు కాంగ్రెస్ పార్టీలు వికలాంగులకు రూ.6వేల పింఛన్ ప్రకటించాయన్నారు. జగన్ మాత్రం తన మేనిఫెస్టోలో కేవలం రూ.3500 ప్రకటించి, అది కూడా ఐదేళ్లలో రెండు దఫాలుగా పెంచుతామనడం సిగ్గుచేటన్నారు. పక్కనున్న తెలంగాణలో దివ్యాంగులకు ఇప్పటికే రూ.6,116 ఇస్తోందని శ్రీనివాస్ గుర్తు చేశారు. దివ్యాంగులకు చేయూత నిచ్చే వారికే ఓటు వేయాలన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్లు నివారణ

చీడికాడ, ఏప్రిల్ 30: రైతులు ముందుగా విత్తనశుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చునని శ్రీకాకుళం కింజరాపు యర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పావని, పవిత్ర, రూప, సృజన, ప్రసన్న తెలిపారు. శిరిజాం గ్రామంలో మంగళవారం రైతులతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, పొలాల్లో విత్తనాలు వేసేముందు ట్రైక్‌డెర్మ్‌విరిడి పౌడర్‌తో విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా భూమిలో నిద్రావస్థలో ఉన్న కీటకాలు నాశనవుతాయన్నారు. ఈ సందర్భంగా విత్తనశుద్ధి ఎలా చేయాలో చేసి చూపించారు. విత్తనశుద్ధితో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సమకూరుతుందని సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్


ధ్వజ స్తంభం వద్ద అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు

సింహాచలం, ఏప్రిల్ 30: వరాహలక్ష్మీనృసింహస్వామిని కేంద్ర మాజీ మంత్రి, సింహాచలం దేవస్థానం అను వంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఆయన తండ్రి డా. పీవీజీ రాజు శత జయంతి పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. బేడామండప ప్రదక్షిణ తరువాత అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం అనం తరం పండితులు చతుర్వేద వచనాలతో ఆశీస్సులీయగా, ఈఓ శాలువతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

జడ్పీ సమావేశం వాయిదా

» కోరం లేక స్థాయీ సంఘ సమావేశాలూ కూడా...

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున మంగళవారం జరగాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదాపడింది. మధ్యాహ్నం సమావేశానికి హాజరైన సభ్యులతో సంతకాలు తీసుకున్న తరువాత వాయిదా వేసినట్టు సీఈవో ఎం.పోలినాయుడు ప్రకటించారు. దీనికి ముందు ఉదయం 10.30 గంటల నుంచి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. అయితే నిర్ణీత సమయానికి జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో ఎం.పోలినాయుడు సమావేశ మందిరంలో ఆశీనులయ్యారు. పలు శాఖల అధికారులు వచ్చారు. కానీ సమావేశాల నిర్వహణకు అవసరమైన జడ్పీటీసీ సభ్యులు హాజరుకాలేదు. కోరం లేని కారణంగా సమావేశాలు వాయిదా వేసినట్టు సీఈవో తెలిపారు.


జానకయ్యపేటలో బీసీ సభలో మాట్లాడుతున్న సీఎం రమేశ్


సభకు హాజరైన నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం నాయకులు

జూన్ 4 తరువాత జగన్ లెక్క తేలుతుంది

» రాక్షసుడి నుంచి రాష్ట్రానికి విముక్తి
» పవన్ చాలా గొప్ప వ్యక్తి
» అనకాపల్లి ఎంపీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
» జానకయ్యపేట యాదవ సమ్మేళనంలో సీఎం రమేశ్
» పరిశ్రమల ఏర్పాటు చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి హామీ

నక్కపల్లి, ఏప్రిల్ 30: తండ్రిలేని వాడు కదా అని ప్రజలు ఒక్క చాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడని, జూన్ 4 తరువాత జగన్ సహా మనల్ని ఇబ్బంది పెట్టిన వారి లెక్క తేలుతుందని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని జానకయ్యపేటలో నిర్వహించిన నియోజకవర్గం యాదవ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్రానికి రాక్షస పాలన నుంచి విముక్తి కల్పించాలన్న ఏకైక లక్ష్యంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంతో ఆలోచించి, ఎన్‌డీఏ కూటమికి నడుంబిగించారని చెప్పారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహకారంతో గెలిచిన తరువాత అనకాపల్లి జిల్లాను అభివృద్ధి చేస్తానని చెప్పారు. మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేశంలోనే యాదవ కులస్థుల సంఖ్య 20 శాతం వుందని, తిరుపతి వెంకన్న ఆలయాన్ని మొదట తెరిచేది కూడా మీరే అన్నారు. బీసీలకు వెన్నుదన్నుగా వుండే పార్టీ టీడీపీ అన్నారు. కూటమి, వైసీపీ మేనిఫెస్టోలను దగ్గరపెట్టి చూస్తే ఏది మంచిదో ప్రజలకు అర్థమవుతుందన్నారు.

కష్టకాలంలో అండగా వుంటే వ్యక్తి పవన్: అనిత

కష్టకాలంలో అండగా వుండే వ్యక్తి జనసేన అధినేత పవన్ కల్యాణ్ అని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. తమ అధినేత చంద్రబాబు కష్టకాలంలో వుంటే రాష్ట్రానికే కష్టం వచ్చిందని తెలిసి జైలుకు వెళ్లి అదేరోజు మద్దతు ప్రకటించిన గొప్ప వ్యక్తి పవన్ అన్నారు. అప్పటి నుంచి రోజురోజుకూ కూటమికి ఆదరణ పెరుగుతూనే వుందన్నారు. జానకయ్యపేట గ్రామం అంటే తనకు పుట్టినిల్లని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు కురందాసు నూకరాజు, సింహాచలం, దేవర సత్యనారాయణ, వైబోయిన రమణ,అల్లు నరసింహమూర్తి, కోన అప్పలరాజు, జనసేన నేత కురందాసు అప్పలరాజు, గొనగాల రామకృష్ణ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

» బీజేపీ నాయకురాలు, సినీ నటి ఖుష్బూ


లక్ష్మీదేవిపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఖుష్బూ, సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 30: అనకాపల్లిలోని కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ నాయకురాలు, సినీనటి ఖుష్బూ కోరారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌తో కలిసి లక్ష్మీదేవిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో జరిగిన సమావేశంలో ఖుష్బూ మాట్లాడుతూ సమర్థుడైన సీఎం రమేశ్‌ను పార్లమెంట్‌కు పంపించాలన్నారు. అలా పంపితే ఆయన కేంద్ర మంత్రి కావడం తథ్యమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని, ఆ పథకాలన్నింటినీ అనకాపల్లి వాసులకు అందించే సత్తా సీఎం రమేశ్‌కు ఉందన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చాలా మంచి వ్యక్తి అని కొనియాడారు. అలాగే జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణను కూడా గెలిపించాలని కోరారు. పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాష్ట్రంలో జగన్ అరాచక పాలన సాగుతుందని, దీనిని అంతమొందించేందుకు ఇదే సమయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, భరణికాన నరసింహమూర్తి, టీడీపీ నాయకులు ప్రసాద్, ఎస్.పద్మలత తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆస్పత్రి భవనంలోకి సీహెచ్‌సీ మార్పు

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన వైద్య శాఖ అధికారులు
» వైద్య సామగ్రిని షిఫ్టు చేస్తున్న సిబ్బంది


నూతన సీహెచ్ భవనంలో సిద్ధం చేస్తున్న రోగుల బెడ్లు


ఎలమంచిలిలో నూతన ఆస్పత్రి భవనంలోకి సామగ్రి తరలిస్తున్న సిబ్బంది

ఎలమంచిలి, ఏప్రిల్ 30: స్థానిక తులసీనగర్‌లో నాలుగు నెలల క్రితం ప్రారంభించి నిరుపయోగంగా వదిలేసిన నూతన ఆస్పత్రి భవనానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ ఆస్పత్రి నిరుపయోగంగా వదిలేశారంటూ ఈనెల 29వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో వైద్యశాఖ అధికారులు స్పందించారు. వెంటనే నూతన భవనంలోకి సీహెచ్‌సీని షిఫ్టు చేయాలని స్థానిక వైద్యాధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో మంగళవారం పాత ఆస్పత్రిలోని వైద్య సామగ్రి, రోగుల బెడ్లు, ఎలక్ట్రికల్ విభాగం తదితర విభాగాలకు చెందిన సామగ్రిని నూతన ఆస్పత్రి భవనంలోకి షిఫ్ట్ చేస్తున్నారు. అనంతరం నూతన ఆస్పత్రి భవనంలో మరికొన్ని విభాగాలకు చెందిన వాటి పనులు పూర్తి చేసి నూతన ఆస్పత్రి భవనంలో రోగులకు వైద్య సేవలు అందించేందుకు వైద్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

జగన్‌కు ఓటేస్తే మరో రూ.2 లక్షల కోట్లు వెనకేసుకుంటారు

» అరకు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలి
» సినీ నటి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు ఖుష్బూ


అరకు నాలుగు రోడ్ల కూడలిలో మాట్లాడుతున్న ఖుష్బూ

అరకులోయ, ఏప్రిల్ 30: జగన్‌కు ఓటేస్తే మరో రూ.2 లక్షల కోట్లు వెనకేసుకుంటారు తప్పితే అభివృద్ధి చేయరని సినీ నటి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు ఖుష్బూ అన్నారు. అరకులోయలో కూటమి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావుకు మద్దతుగా మంగళవారం సాయంత్రం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్ షో ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రమంతా నష్టమేనని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల పేరిట లక్షలాది రూపాయులు అక్రమంగా కూడగట్టుకుంటారని, మళ్లీ అధికారం ఇస్తే మరో రూ.2 లక్షల కోట్లు దోచేస్తారని ఆరోపించారు. ఇటువంటి వ్యక్తికి, వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయొవద్దని ఆమె పిలుపునిచ్చారు. తోడబుట్టిన చెల్లమ్మలే సీఎం జగన్ ఎలాంటి వ్యక్తిత్వం గలవారో రాష్ట్రమంతా పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు.

అరకు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలి

అరకు అనుకున్నంత స్థాయిలో పర్యాటకంగా అభివృద్ధి చెందలేదని ఖుష్బూ వాపోయారు. 32 ఏళ్ల క్రితం కెప్టెన్ నాగార్జున షూటింగ్‌కు వచ్చానని, అప్పటి నుంచి అలాగే ఉందని చెప్పారు. దేశ, విదేశాల నుంచి పర్యాటకులు ఇష్టపడి వచ్చే అరకు ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. రాష్ట్రం, కేంద్రంలోనూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు.

విజనరీ నేత చంద్రబాబునాయుడు, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో మంచి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. అరకు ఎంపీగా కొత్తపల్లి గీతను, ఎమ్మెల్యేగా పాంగి రాజారావును గెలిపించాలని, వీరు గెలిచాక మరోమారు తన పిల్లలతో అరకులోయ వస్తానని ఖుష్బూ చెప్పారు. అంతకు ముందు కొత్తపల్లి గీత, గిరిజన కళాకారులతో కలిసి సినీ నటి ఖుష్బూ ధింసా నృత్యం చేసి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, నియోజకవర్గ పరిధిలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కూటమిని గెలిపించాలి

» ఎంఆర్‌పీఎస్ ఏపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు


సంఘీభావం తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఎలమంచిలి, ఏప్రిల్ 30: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దళితులకు చెందిన 27 పథకాలను నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని విమర్శించారు. మాదిగ ఉప కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ తీరును విమర్శించారు. ఈ కార్యక్రమంలో దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, చర్మకారుల సంక్షేమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, ఎలమంచిలి జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ. 2.10 కోట్లు

సింహాచలం, ఏప్రిల్ 30: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీల ఆదాయం గత 35 రోజులకు గాను సుమారు రూ. 2.10 కోట్లు లభించింది. మంగళవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో ఈఓ శ్రీనివాసమూర్తి, దేవదాయ శాఖ ప్రత్యేక అధికారి ప్రసన్నలక్ష్మీ పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తు మధ్య హుండీల లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా రూ.2,10,60,286 నగదు, 104 గ్రాముల స్వర్ణం, 15.450 గ్రాముల వెండి ఆభరణాలు సమకూరాయి. అలాగే యూఎస్‌ఏ డాలర్లు 126, ఇంగ్లాండు కరెన్సీ 75, యూఏఈ కరెన్సీ 130, మలేషియా కరెన్సీ 18, కెనడా కరెన్సీ 120, ఖతార్ కరెన్సీ 20, సౌదీ అరేబియా కరెన్సీ 10 స్వామి వారి ఖజానాకు లభించినట్టు ఈఓ తెలిపారు.

క్రైం... crime news

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శాంతారామ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 30: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ కె. శాంతారామ్ మంగళవారం తెలిపారు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జికి సమీపంలోని 40 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్టు భావిస్తున్నామన్నారు. ఐదు అడుగుల ఎత్తు ఉన్న మృతుడు నలుపురంగు కలిగి ఉన్నాడని, లేత నారింజరంగు చొక్కా, నీలం కలర్ జీన్‌ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మరేతర ఆధారాలు లభించలేదన్నారు. మృతుని వివరాలు తెలిస్తే సెల్‌నంబరు 7673906010కు సమాచారం అందివ్వాలని కోరారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చ్యురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టీడీపీ , వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

» ఒకరికి స్వల్ప గాయాలు


గాయపడిన బోలెం నాగేశ్వరరావు

కె.కోటపాడు, ఏప్రిల్ 30: మండలంలోని కె.సంతపాలెంలో ప్రభుత్వ మద్యం దుకాణానికి సమీపంలో టీడీపీ , వైసీపీ కార్యకర్తల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ లక్ష్మీనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్లి గ్రామానికి టీడీపీ కార్యకర్త బోలెం నాగేశ్వరరావు, కె. సంతపాలెంనకు చెందిన వైసీపీ కార్యకర్త వాకాడ పైడిరాజు ఇద్దరి మధ్య మంగళవారం గొడవ జరిగింది. పైడిరాజు బీరు సీసాతో నాగేశ్వరరావును తలపై గాయపరిచాడు. దీంతోగాయపడిన అతనిని చికిత్స నిమిత్తం కె.కోటపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ తగదాలో నాగేశ్వరరావూ స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని వాకాడ పైడిరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఏప్రిల్ 30: మండలంలోని తాడి బీసీ కాలనీకి చెందిన పి.అప్పలరాజు మంగళవారం రాత్రి పరవాడ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి పది క్వార్టర్ మద్యం సీసాలు కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. అతని వద్ద మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

వారాహి యాత్రను జయప్రదం చేయండి

» జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

అచ్యుతాపురం, ఏప్రిల్ 30: అచ్యుతాపురం జంక్షన్‌లో బుధవారం సాయంత్రం మూడు గంటలకు జరిగే వారాహి విజయ యాత్రను విజయవంతం చేయాలని జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రాక్షస పాలనను అంతం చేయడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో దిగామన్నారు. సెజ్ కర్మాగారాల్లో స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు భారీగా దోచుకున్నారన్నారు. తాను విజయం సాధించలేనని గమనించిన కన్నబాబు రాజు దొడ్డిదారులు వెతుకుతున్నారని, దీనిని తాము సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామన్నారు. వారాహి విజయ యాత్రకు జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, జనపరెడ్డి నరసింగరావు, భైలపూడి శ్రీరామ దాసు పాల్గొన్నారు.

జగన్ సభ కోసం మోహరించిన పోలీసులు

పాయకరావుపేట, ఏప్రిల్ 30 : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం పట్టణంలో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభ కోసం మంగళవారం సాయంత్రం నుంచి పోలీసులు భారీగా మోహరించారు. పట్టణంలోని సూర్యమహల్ సెంటర్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు జగన్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. మంగళవారం సాయంత్రానికే వందలాది మంది పోలీసులు, పారా మిలట్రీ సిబ్బంది చేరుకున్నారు. ముఖ్యమంత్రి హెలీకాప్టర్‌లో వస్తున్నందున మంగవరంరోడ్డు శివారులో హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. పోలీసులు ఉన్నతాధికారులు బుధవారం ఏర్పాట్లు, సభా స్థలిని పరిశీలించారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడంతో సభకు వచ్చే ప్రజల కోసం మంచినీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇరువర్గాల కొట్లాట : పోలీసులపై దాడి?

ఎలమంచిలి, ఏప్రిల్ 30: ఎలమంచిలి-అచ్యుతాపురం రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో రెండు కార్లు ఢీకొనడంతో మంగళవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కారు మిర్రర్ దెబ్బతినడంతో రెండు కార్లకు చెందిన వారు వాదనకు దిగారు. ఈ సమయంలో రెండు కార్లలో ఉన్నవారు కొట్లాటకు దిగడంతో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయినట్టు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తుండగా వారిపై దాడి జరిగినట్టు తెలిసింది. ఈ ఘటనలో పట్టణ ఎస్ఐ పాపినాయుడుతో పాటు ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని తులసీనగర్‌లోని నూతన ఆస్పత్రి భవనంలో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. ఆస్పత్రికి సీఐ గఫూర్ వచ్చి గాయపడిన వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేసవి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 30: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ, విజయనగరం మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

సంబల్‌పూర్-బెంగళూరు-సంబల్‌పూర్ వయా దువ్వాడ

08321 నంబరు గల రైలు మే 9, 16వ తేదీల్లో (ప్రతి గురువా రం) సాయంత్రం 6.45 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 4.55 గంటలకు దువ్వాడ, రాత్రి 11.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి మే 11, 18వ తేదీల్లో (ప్రతి శనివారం) తెల్లవారుజాము 1.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి అదేరోజు (శనివారం) రాత్రి 8.30 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.30 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

సూరత్-బ్రహ్మపూర్-సూరత్ వయా విజయనగరం

09069 నంబరు గల రైలు మే ఒకటి నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు సూరత్‌లో బయలుదేరి మర్నాడు సాయంత్రం 4.15 గంటలకు విజయనగరం, రాత్రి 8.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరిగి మే 2 నుంచి జూన్ 27 వరకు ప్రతి గురువారం రాత్రి 10.00 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 1.05 గంటలకు విజయనగరం, శనివారం ఉదయం 6.30 గంటలకు సూరత్ చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

రాష్ట్రంలో మరో రెండు వారాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాన పార్టీలన్నీ ప్రచారం హోరెత్తిస్తున్నాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎన్నికలపైనే చర్చే. ఈ నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి పలువర్గాల ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునే ప్రయత్నాన్ని 'ఆంధ్రజ్యోతి' చేస్తోంది. అందులో భాగంగానే బీచ్‌రోడ్డులో మార్నింగ్ వాక్‌కు వచ్చిన పలువురిని పలకరించింది. గతంలో ఎన్నికలకు దూరంగా ఉన్న పలువురు సీనియర్ సిటిజన్స్... ఈసారి ఎట్టి పరిస్థితుల్లో ఓటేయాలన్న నిర్ణయాన్ని తీసుకోవడం గమనార్హం. విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లే పాలనా దక్షత కలిగిన నేతకు పట్టం కడతామని పలువురు చెప్పారు. గడిచిన ఐదేళ్లలో విశాఖ అభివృద్ధి చెందలేదని అనేకమంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐటీ రంగాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని రాజేంద్రవిజయ్ అనే ఉద్యోగి వాపోయారు. గతంలో విశాఖ కేంద్రంగా పనిచేసిన పలు ప్రముఖ కంపెనీలు ఇక్కడి నుంచి వెళ్లిపోవడం ఐటీ రంగానికి దెబ్బగానే భావించాలన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి విశాఖలో మంచి అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కొందరు అన్నారు. రానున్న రోజుల్లో విశాఖ నగరం మరింత పెరుగుతుందని, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు కనిపించడం లేదని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి శివరామకృష్ణ పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతోపాటు అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులు, ఉద్యోగ కల్పనకు అవకాశం ఉన్న సంస్థలు, పరిశ్రమల ఏర్పాటుపై దృష్టిసారించాలని ఆయన కోరారు.

● ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

వేదిక



ఎదుగూ... బొదుగూ లేని విశాఖ

నగరం అభివృద్ధి చెందలేదని పలువురి అసంతృప్తి

- ఐటీ రంగంపై పూర్తిగా నిర్లక్ష్యం
- నగరాభివృద్ధికి ప్రణాళికలు అవసరం
- మౌలిక సదుపాయాల కల్పనపై పాలకులు దృష్టిసారించాలి

వాకర్స్ మనోగతం

- యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా పరిశ్రమలు తీసుకురావాలి
- విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లే పాలనా దక్షత కలిగిన నేతకు పట్టం కడతాం
- సంక్షేమం ఒక్కటే సరిపోదు, అభివృద్ధి కావాలి
- పరిపాలనా దక్షత కలిగిన నేతలకే ఓటు వేస్తాం

సాఫ్ట్‌వేర్ రంగం పూర్తిగా దెబ్బతింది



విశాఖను సాఫ్ట్‌వేర్ హబ్‌గా మార్చేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. అయితే పాలకులు సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల ఆ రంగానికి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. విశాఖ కేంద్రంగా పనిచేసిన కొన్ని కంపెనీలు రెండేళ్ల కిందట పూర్తిగా ఇక్కడ నుంచి వెళ్లిపోయాయి. కొత్త కంపెనీలు రాలేదు. ఐటీ రంగం పూర్తిగా కుదేలైపోయింది. రాష్ట్రంలో కీలక నగరమైన విశాఖను ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేయాలి. అటువంటి వారికి ఉద్యోగుల సంపూర్ణ మద్దతు ఉంటుంది. పాలకులు ఆ దిశగా ఆలోచన చేస్తే బాగుండేది. కానీ, ఐదేళ్లలో ఈ రంగం పట్ల పూర్తి నిర్లక్ష్యం కనిపించింది. ఉద్యోగ కల్పనలో ముందుచూపు ఉన్న నేతకు వచ్చే ఎన్నికల్లో అండగా ఉండాలి. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుంది.

- కె.రమేష్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, ఎంవీపీ కాలనీ

ప్రాథమిక అవసరాలపై దృష్టి సారించాలి



ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రజల జీవితాల్లో మార్పులు మాత్రం రావడం లేదు. అధికారంలోకి ఎవరు వచ్చినా ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చాలి. ప్రతి ఒక్కరికీ ఉండడానికి సొంత ఇల్లు, మంచి నీటి సదుపాయం, ఇతర మౌలిక వసతులను కల్పించాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. చేసేందుకు ప్రతి ఒక్కరికీ పని ఉండేలా చూడాలి. అప్పుడే ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయి. సాధారణ, మధ్య తరగతి ప్రజల ఇబ్బందులను ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకుని మంచి నిర్ణయాలు తీసుకోవాలి. అటువంటి మంచి నిర్ణయాలు తీసుకునే పార్టీకి అండగా ఉంటాం.

- పి.రామారావు, రిటైర్డ్ ఉద్యోగి, ఎంవీపీ కాలనీ

అప్పులు చేసి పంచుతామనే విధానం సరికాదు



అప్పులు చేసి ప్రజలకు మంచి చేస్తామనే విధానం సరికాదు. ఒక కుటుంబంలో ఆరుగురు ఉన్నప్పుడు వారి పోషణ భారం కుటుంబ పెద్దపై పడుతుంది. కుటుంబ పెద్ద పనిచేసి సంపాదించి తెచ్చే మొత్తం సరిపోనప్పుడు అప్పులు చేస్తాడు. పని చేయకుండా అప్పు చేసే కుటుంబాన్ని పోషించాలని చూస్తే...ఆ భారం భవిష్యత్తులో కుటుంబ సభ్యులపై పడుతుంది. ఇప్పుడు పాలకులు చేస్తున్న అప్పులు కూడా భవిష్యత్తులో రాష్ట్రంలోని ప్రజలపై పడతాయి. కాబట్టి...అప్పులు చేసి ప్రజలకు పప్పు కూడు పెట్టాలన్న ఆలోచన మంచిది కాదు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు అనుగుణమైన మార్గాలను ప్రజలకు చూపించాలి. ఒక రూపాయి ఇస్తే...మరో పది రూపాయలు సంపాదించుకునే అవకాశాలను వారికి కల్పించాలి. అప్పుడే రాష్ట్ర ప్రజల ఆదాయం పెరుగుతుంది. తద్వారా రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుంది. ఆ దిశగా ఆలోచించే వారికి ప్రజలు అండగా ఉంటారు.

- కె.సర్వేశ్వరరావు, వ్యాపారి, కొత్తవలస

ఓటు బ్యాంక్ రాజకీయాలు మంచిది కాదు



రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందేందుకు అనుగుణమైన ప్రణాళికలు ఉండాలి. అంతేకానీ, ఓటు బ్యాంకును సృష్టించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుని పథకాలు అమలు చేయడం మంచిది కాదు. రాష్ట్ర అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలి. అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలు రావడానికి అనుగుణమైన నూతన విధానాలు, ఐటీ పాలసీ...వంటి అంశాలపై దృష్టి సారించాలి. అప్పుడే ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంటుంది. తాత్కాలికమైన ప్రలోభాలకు ప్రజలు లొంగకుండా.. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రజలు కూడా నోటుకో, మద్యానికో ఓటును అమ్ముకోకుండా.. నిజాయితీగా ఓటేయాలి. అప్పుడే ఐదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేయని వారిని...చొక్కా పట్టుకుని అడిగేందుకు అవకాశం ఉంటుంది.

- పి.కమల్, ప్రైవేటు ఉద్యోగి

ప్రజలకు అందుబాటులో ఉండే నేతను ఎన్నుకోవాలి



ప్రభుత్వాలు ఎన్నెన్నో చెబుతుంటాయి. అవన్నీ అమలు చేయడం ఎవరికీ సాధ్యం కాదు. స్థానికంగా ఎమ్మెల్యేను మాత్రం అందుబాటులో ఉండే వ్యక్తిని ఎన్నుకోవాలి. ఏ కష్టం వచ్చినా వెళితే స్పందించేవాడు అయి ఉండాలి. అటువంటి వ్యక్తిని ఎన్నుకుంటేనే ప్రజలకు మేలు జరుగుతుంది. ప్రజలు ఆనందంగా జీవించేందుకు అనుగుణమైన ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేయాలి. ఇల్లు, చేసుకోవడానికి పని, ఉచిత విద్య, వైద్యం...ఈ నాలుగు ఉంటే చాలు. ప్రజలకు వీటి కంటే కావాల్సినవి ఇంకేమీ ఉండవు. పాలకులు వస్తున్నారు.. పోతున్నారు కానీ..ఈ నాలుగింటినీ ఇచ్చే నాయకులు మాత్రం కనపడడం లేదు. ఇప్పటికీ లక్షల మంది సొంత ఇల్లు లేకుండానే జీవనం సాగిస్తున్నారు. ఇంకెప్పుడు ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయి.

- సుందరపు నీలకంఠస్వామి, వన్‌టౌన్ ఏరియా

ఉద్యోగాలు దొరకడం లేదు



గడిచిన ఐదేళ్లలో ప్రజల ఆదాయం పెరిగే మార్గాలను ప్రభుత్వం చూపించలేకపోయింది. అన్ని రకాల ధరలు పెరిగిపోయాయి. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చాలామంది చదివిన చదువులకు అనుగుణమైన ఉద్యోగాలు దొరకడం లేదు. నాలాగే ఎంతోమంది కొరియర్ బాయ్‌లుగా, డెలివరీ బాయ్‌లుగా, బైక్ డ్రైవర్లుగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు పాలనాపరంగా మంచి నిర్ణయాలు తీసుకుంటే...మాలాంటి సాధారణ ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయి. ప్రతి కుటుంబం నెలకు ఎంతో కొంత సంపాదించుకునే మార్గాలను ప్రభుత్వాలు చూపించాలి. అటువంటి ఆలోచన కలిగిన నేతను ఎన్నుకుంటాం.

- ఎస్.సాయి, అల్లిపురం, కొరియర్ బాయ్

సంక్షేమంతో పాటు అభివృద్ధి ఉండాలి



ఏ ప్రభుత్వమైనా పూర్తిగా సంక్షేమానికి కట్టుబడి ఉండడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూనే...అభివృద్ధిని కూడా పరుగులు పెట్టించాలి. అప్పుడే రాష్ట్రాభివృద్ధికి, ప్రజల జీవన విధానంలో మార్పులకు అవకాశం కలుగుతుంది. పది మందికి మేలు చేకూర్చే నిర్ణయాలను పాలకులు తీసుకోవాలి. ఆ దిశగా పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించాలి. సంక్షేమానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేందుకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఇది కొంత ఇబ్బందిని కలిగిస్తుంది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతిని మెరుపరచేందుకు ప్రయత్నించాలి. అటువంటి నేతను ఎన్నుకోవాలి.

- పి.ఉమామహేశ్వరరావు, వ్యాపారి, ఎన్ఏడీ

ఐదేళ్లుగా మధ్య తరగతికి ఇబ్బందులు



గడిచిన ఐదేళ్లలో మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలకు సంబంధించిన అనేక ఇబ్బందులు వచ్చాయి. ఉచిత పథకాలకు భారీగా ఖర్చు పెడుతున్నారు. మౌలిక వసతులు కల్పనపైనా, ఉద్యోగాలు కల్పించేందుకు ఉన్న మార్గాలపై ఈ ప్రభుత్వం దృష్టి సారించలేదు. కొన్ని మంచి నిర్ణయాలు తీసుకున్నా.. ఓవరాల్‌గా చూసుకుంటే మాత్రం ఇబ్బందికరంగా ఉంది. సాధారణ, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే ప్రభుత్వాలను ఎన్నుకోవాలి. అప్పుడే ఇబ్బందులు ఉండవు. వేతనాల కంటే ఖర్చులు పెరిగిపోయిన నేపథ్యంలో.. బతకడం కష్టమవుతోంది.

- ఎస్.సత్యనారాయణ, ప్రైవేటు ఉద్యోగి, విశాలాక్షినగర్

మొదటి ముఖ్యమంత్రికి పట్టం కట్టిన జిల్లా

శృంగవరపుకోట నుంచి పోటీ చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు

- అప్పట్లో ఎస్.కోట విశాఖ జిల్లాలోనే...



ప్రకాశం పంతులు

మద్రాసు నుంచి విడిపోయి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు సమయంలో మొదటి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు ఆనాటి ఉమ్మడి విశాఖ జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గం నుంచే పోటీచేసి విజయం సాధించారు. ఈ జిల్లాతో ఆయనకు ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ ఇక్కడి నుంచే పోటీకి మొగ్గుచూపారు. ఆనాడు శృంగవరపుకోట విశాఖ జిల్లాలోనే ఉండేది. 1979లో విజయనగరం జిల్లా ఏర్పడిన తరువాత ఆ జిల్లాలో విలీనమయింది. రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిని అందించింది విశాఖ జిల్లా అని తెలిస్తే చాలామంది ఆశ్చర్యపోతారు. ఆయన చేసింది కొద్ది కాలమే అయినప్పటికీ స్థానిక శాసనసభ్యుడిగా ఆయన చేసిన కృషి అజరామరమని చెబుతుంటారు.

మీకు తెలుసా!

ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన తర్వాత మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా రాష్ట్రం ఏర్పాటయింది. ఈ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించడంతో పాటు ప్రజాసేవలో పేర్గాంచిన టంగుటూరి ప్రకాశం పంతులును ముఖ్యమంత్రిని చేయాలన్న ప్రతిపాదన వచ్చింది. అప్పటికి ఆయన న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఏ చట్టసభల్లోనూ సభ్యుడు కాదు. అయినప్పటికీ అప్పటి ప్రధానమంత్రి టంగుటూరినే ముఖ్యమంత్రిగా ప్రకటించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టి 1953 అక్టోబరు 1 నుంచి 15 నవంబరు 1954 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారు. శాసనసభ్యుడు కాకుండా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వారెవరైనా ఆరు నెలల్లోగా సభకు ఎన్నిక కావాలి. టంగుటూరి సొంత జిల్లా ప్రకాశంలో పోటీ చేయాలని భావించినప్పటికీ, అప్పటికే అక్కడి నుంచి గెలుపొందిన సభ్యులను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నించారు.

పదవిని వదులుకున్న సోమయాజులు

అప్పటికి శృంగవరపుకోట నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండేవారు. వారిలో రిజర్వుడు కాని ఎమ్మెల్యేగా ఎన్నికైన చాగంటి వెంకటసోమయాజులు టంగుటూరి కోసం తన పదవిని వదులుకునేందుకు సిద్ధపడ్డారు. టంగుటూరి విశాఖ జిల్లా పర్యటనకు వచ్చి సోమయాజులును కలుసుకుని, ఆయన ఆమోదాన్ని తీసుకున్నారు. తన కోసం పదవికి రాజీనామా చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. దీంతో ఖాళీ అయిన శృంగవరపుకోట నుంచి టంగుటూరి ప్రకాశం పంతులు పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టంగుటూరి గెలుపునకు సోమయాజులు విశేష కృషి చేశారని చెబుతారు. అన్నీ తానే అయి జిల్లా నుంచి ముఖ్యమంత్రిని గెలిపించిన ఆదర్శ నేతగా ఆయన పేరు పొందారు.

ఎవరీ సోమయాజులు

శృంగవరపుకోట ప్రాంతానికి చెందిన బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన చాగంటి వెంకట సోమయాజులుకు ప్రజల్లో ఎంతో పలుకుబడి ఉండేది. సోషలిస్టు పార్టీలో కీలకంగా పనిచేసేవారు. మొదటిసారి 1952లో ఎన్నికలు జరిగిన సమయంలో అనేకమంది సోమయాజులును పోటీ చేయాలని కోరడంతో రాజకీయాల్లోకి వచ్చారు. నియోజకవర్గంలో శృంగవరపుకోట, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, జామి ప్రాంతాలు ఉండేవి. ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న సమయంలో ఆయన ప్రతినిధిగా ఇక్కడ సోమయాజులు వ్యవహరించేవారు. ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించేవారు. ఆ అసెంబ్లీ కేవలం మూడు సంవత్సరాలు పనిచేసింది. 1955లో శ్రీకాళహస్తి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన నీలం సంజీవరెడ్డి 1957 వరకు ముఖ్యమంత్రిగా చేశారు. 1957 నుంచి 1962 వరకు దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి. ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా చేసిన తర్వాత మళ్లీ 11.2.1955న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సోమయాజులు శృంగవరపుకోట నుంచి పోటీచేసి 19,771 ఓట్లు తెచ్చుకున్నారు. రెండో రిజర్వుడు ఎమ్మెల్యేగా గుజ్జాల రామునాయుడు 18,887 ఓట్లతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక ఆ తర్వాత ఏ ఎన్నికల్లోనూ సోమయాజులు పోటీ చేయలేదు. ఆయన కుమారుడు చాగంటి వెంకట మోహన్ విశాఖపట్నంలో ఓ దినపత్రికలో ఉప సంపాదకుడిగా పనిచేస్తూ నగరంలోనే నివాసం ఉండేవారు. ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు కోసం తన ఎమ్మెల్యే పదవిని వదులుకున్న సోమయాజులు ఆదర్శనేతగా నిలిచారు.

● భీమునిపట్నం రూరల్

ఓటు వేయాలంటే 'గుర్తింపు' తప్పనిసరి



ఓటరు జాబితిలో ఉన్న ప్రతి ఓటరూ ఓటు వేసేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోంది. బోగస్ బెడద లేకుండా అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తోంది. పోలింగ్ తేదీకి ముందే ఓటర్ల స్లిప్పులను ఇంటింటికీ పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఎన్నికల స్లిప్పుతో గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రంలో ఓటర్లు చూపాల్సి ఉంటుంది.

గుర్తింపునకు ప్రత్యామ్నాయాలు

ఎన్నికల స్లిప్పులతో పాటు ఓటరు గుర్తింపు కార్డు ఉంటే సరిపోతుంది. లేదంటే పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఆయా సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులు, బ్యాంకు లేదా పోస్టాఫీసు జారీ చేసిన పాస్‌బుక్‌లు, పాన్ కార్డు, కార్మిక శాఖ జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటోతో పాటు ఉండే పెన్షన్ డాక్యుమెంట్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అధికారికంగా జారీ చేసే గుర్తింపు కార్డు, ఆధార్ కార్డులతో ఏదో ఒకటి విధిగా పోలింగ్ సిబ్బందికి చూపించాల్సి ఉంటుంది.

తెలుగులోనే ఓటరు స్లిప్పులు

బీఎల్‌వోలు పంపిణీ చేసే ఓటరు స్లిప్పులను స్పష్టంగా ఫొటో కనిపించేలా పెద్దవిగా ముద్రించాలని, వివరాలు తెలుగులోనే ఉండాలని నిర్దేశించారు. వీటిని సంబంధిత ఓటరుకే ఇవ్వాలని, ఓటరు స్లిప్పులు అందినట్టు సంతకాలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ కాకుండా మిగిలినపోయిన ఓటరు స్లిప్పులను బీఎల్‌వోలందరూ సంబంధిత ఈఆర్‌వోకు అందజేయాలి. పంపిణీ కాని ఓటరు స్లిప్పుల వివరాలను అక్షర క్రమంలో జాబితాగా తయారు చేసి రిటర్నింగ్ అధికారులకు అందజేయాలి. అంతేకాకుండా పంపిణీ కాని ఓటరు స్లిప్పులను సీల్డ్ కవర్లో ఉంచి ఆఆర్‌ఓ కస్టడీలోనే ఉంచాలని, వారికి అందజేసిన తర్వాత ఓటరు స్లిప్పులను ఎవరికీ పంపిణీ చేయరాదని ఎన్నికల సంఘం నిర్దేశించింది.

● విశాఖపట్నం

ఓటరు మాట

అభివృద్ధి, ఉద్యోగాల సృష్టి అవసరం



రాష్ట్రాభివృద్ధికి, ఉద్యోగాల సృష్టికి ప్రాధాన్యమిచ్చే పార్టీని ఎన్నికోవాలి. పారిశ్రామిక, వ్యవసాయక రంగాలు అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తద్వారా సంపద సృష్టి జరుగుతుంది. విజన్ ఉన్న పార్టీ అధికారం చేపడితే పెట్టుబడులు వస్తాయి. యువతకు రాష్ట్రంలోనే ఉద్యోగాలు లభిస్తాయి. ఇలాంటి ఆలోచనలున్న పార్టీ అభ్యర్థులకే ఓట్లు వేయాలి.

- ఆర్.మణికంఠకుమార్, ప్రభుత్వ ఉద్యోగి, గోపాలపట్నం

రాష్ట్రాన్ని నాశనం చేసే పార్టీలు వద్దు



హక్కులు కాపాడే ప్రభుత్వం ఏర్పాటు కావాలి. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేసే ఆలోచనలున్న ప్రభుత్వాలను, నాయకులను ఎన్నుకుంటే మరిన్ని కష్టాలు తప్పవు. సహజవనరులు దోపిడీకి గురికాకుండా, ప్రకృతిని విధ్వంసం చేయకుండా, సంక్షేమ పాలన అందించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అలాంటి ప్రణాళికలున్న పార్టీని ఎన్నుకోవాలి. విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలి.

- ఎస్.ఆదిత్య, కాల్‌సెంటర్ ఉద్యోగి, సీతంపేట

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫొటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243


అక్కడ వరుసగా రెండోసారి గెలుపొందడం కష్టమే..

మూడు దశాబ్దాలుగా పాడేరులో కొనసాగుతున్న ఆనవాయితీ

- 1999కి ముందు తమర్భ చిట్టినాయుడు మూడుసార్లు కొట్టగుల్లి చిట్టినాయుడు రెండుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక
- వారిద్దరూ మినహా ఎవరికీ దక్కని చాన్స్

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

పాడేరు ఎమ్మెల్యేగా ఎవరికైనా ఒక్కసారి మాత్రమే నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇస్తారనే నానుడి చాలా ఏళ్లుగా ప్రచారంలో ఉంది. నియోజకవర్గం ఏర్పడినప్పటికీ నుంచి నేటి వరకు తమర్భ చిట్టినాయుడు మూడుసార్లు, కొట్టగుల్లి చిట్టినాయుడు రెండుసార్లు గెలుపొం దారు. వారిద్దరూ మినహా మరెవరూ రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందిన దాఖలాలు లేవు. 1999 నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుంది.



పాడేరు పట్టణం వ్యూ

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం 1967లో ఏర్పడింది. తొలి ఎన్నికల్లో తమర్భ చిట్టినాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే 1972లో జరిగిన ఎన్నికల్లోనూ ఆయనే విజయం సాధించారు. ఆ తర్వాత 1978లో జరిగిన ఎన్నికల్లో గిడ్డి అప్పలనాయుడు ఎమ్మెల్యే కాగా, 1983లో జరిగిన ఎన్నికల్లో మళీ తమర్భ చిట్టినాయుడు మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అలాగే 1985 ఎన్నికల్లో కొట్టగుల్లి చిట్టినాయుడు (తొలిసారి) గెలుపొందారు. 1989లో మత్స్యరాస బాలరాజు విజయం సాధించగా, 1994లో రెండోమారు కొట్టగుల్లి చిట్టినాయుడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతే ఆ తర్వాత రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన దాఖలాలు ఈ నియోజకవర్గంలో లేవు.

ఎమ్మెల్యేగా ఒక్కసారే అవకాశం

1999లో మత్స్యరాస మణికుమారి ఎమ్మెల్యేగా గెలుపొంది, గిరిజన, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా చంద్రబాబునాయుడు క్యాబినెట్‌లో స్థానం సంపాదించుకున్నారు. 2003లో మణికుమారి భర్త వెంకటరాజును నక్సల్స్ హతమార్చారు. ఆ తర్వాత 2004లో జరిగిన ఎన్నికల్లో మణికుమారి పోటీ చేశారు. కానీ ఆ బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన లకే రాజారావు గెలుపొందారు. రెండోమారు ఎమ్మెల్యే అయ్యే అవకాశం మణికుమారికి దక్కలేదు. అలాగే 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పసుపులేటి బాలరాజు, టీడీపీ మిత్రపక్షంగా సీపీఐ అభ్యర్థి గొడ్డేటి దేముడు, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే లకేరాజారావు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పి.బాలరాజు గెలుపొందగా, సిట్టింగ్ ఎమ్మెల్యే లకే రాజారావు ఓటమి పాలయ్యారు. దీంతో లకే రాజారావు సైతం రెండోమారు ఎమ్మెల్యే కాలేకపోయారు. అలాగే 2014లో జరిగిన ఎన్నికల్లో సిట్టింగ్ (కాంగ్రెస్) ఎమ్మెల్యే పసుపులేటి బాలరాజు, వైసీపీ అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి, సీపీఐ అభ్యర్థిగా గొడ్డేటి దేముడు పోటీపడ్డారు. ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి ఎమ్మెల్యేకాగా, పసుపులేటి బాలరాజు ఓడిపోయారు. దీంతో ఆయనకు సైతం రెండోమారు ఎమ్మెల్యే అయ్యే అవకాశం దక్కలేదు. అలాగే 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థినిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, వైసీపీ అభ్యర్థినిగా కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జనసేన అభ్యర్థిగా పసుపులేటి బాలరాజు పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి గెలుపొందారు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఓటమి పాలై రెండోమారు ఎమ్మెల్యే కాలేకపోయారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి పోటీ చేసే అవకాశం రాలేదు. దీంతో రెండోమారు ఎమ్మెల్యే అయ్యే అవకాశాన్ని కోల్పోయారు.



తమర్భ చిట్టినాయుడు (ఫైల్)



కొట్టగుల్లి చిట్టినాయుడు (ఫైల్)

జనరంజకం

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేసిన వారికి డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం లేదు. టీడీపీ హయాంలో ఇచ్చిన నిరుద్యోగ భృతిని నిలిపివేశారు. వీరందరికీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో ఊరట కలిగించింది. రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అప్పటివరకూ నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి, దానికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. వీటివల్ల ఎన్నో లక్షల కుటుంబాలకు మేలు జరుగుతుంది.

చెత్త పన్ను రద్దు..ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు

దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్మోహన్‌రెడ్డి చెత్తపై పన్ను వేశారు. కూటమి అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేస్తామని చంద్రబాబునాయుడు వెల్లడించారు. అదేవిధంగా ల్యాండ్ టైట్లింగ్ చట్టం తీసుకువచ్చింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ చట్టాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఇంటింటికీ పథకం

ప్రతి ఇంటికీ అన్నిరకాల పథకాలు అందేలా చంద్రబాబు మేనిఫెస్టో రూపొందించారు. రక్షిత నీటి కోసం ప్రతి ఇంటికి కుళాయి వేయిస్తామని చంద్రబాబు ప్రకటించారు. గ్యాస్ సిలెండర్ల ధరలు భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో ఆర్థిక భారం తగ్గించేందుకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలు జిల్లా పరిధిలో ఎక్కడికి బస్సులో వెళ్లినా టికెట్ తీసుకోవలసిన అవసరం లేదని, ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామన్నారు. ఇంటి పైకప్పుపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా బిల్లుల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు.

మహిళకు వందనం

ప్రతి మహిళకు 19 నుంచి 59 ఏళ్ల వారికి నెలకు రూ.1,500 ఇస్తామన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.18,500 మాత్రమే ఇస్తోంది. అది కూడా 45 ఏళ్లు దాటిన వారికి 'చేయూత' పేరుతో ఇస్తోంది. చంద్రబాబునాయుడు అలా కాకుండా 19 ఏళ్ల నుంచి ఈ పథకం వర్తింపజేయనున్నారు. నెల నెలా డబ్బులు అందుతాయి. ఇంకా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద రూ.1,500 అందిస్తామని ప్రకటించారు. వృద్ధాప్య పెన్షన్ రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంపు, తల్లికి వందనం కింద ఏడాదికి ఒక్కో బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి అందించనున్నట్టు తెలిపారు. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలు, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తామని, బీసీల కోసం రక్షణ చట్టాన్ని తేనున్నట్టు ప్రకటించారు. అందరికీ గూడు నినాదంతో పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం అందించడమే కాకుండా నాణ్యమైన ఇల్లు నిర్మిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ ఉచిత మంచినీటి కొళాయిల ఏర్పాటు, చేనేతకు 200 యూనిట్లు, మర మగ్గాలుంటే 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచేది లేదని స్పష్టం చేశారు.

మత్స్యకారులకు రూ.20 వేలు

ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులకు ఏడాకి రూ.10 వేలు మాత్రమే లబ్ధి అందిస్తోంది. చేపల వేట నిషేధ సమయంలో 45 రోజులకు భృతి కింద ఈ మొత్తం ఇస్తోంది. చంద్రబాబునాయుడు దీనిని రెట్టింపు చేసి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో మత్స్యకారులందరికీ దీని వల్ల మేలు జరుగుతుంది.

కుటుంబానికి ఆర్థిక దన్నుగా ఉంటుంది



స్వయం సహాయక సంఘాలకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తామని టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో ప్రకటించడం శుభపరిణామం. దీని వల్ల మాలాంటి కుటుంబాలకు ఆర్థిక దన్నుగా ఉంటుంది. మహిళలకు ఆర్థికంగా భరోసా ఉంటుంది. డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతమవుతాయి.

- పైలా పావని, గృహిణి, పరవాడ

మెగా డీఎస్సీ వల్ల ఎందరికో మేలు



జగన్ ప్రభుత్వం డీఎస్సీ ప్రకటిస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూశాను. డీఎస్సీ ప్రిపరేషన్‌లో భాగంగా ఇప్పటి వరకు రూ.2 లక్షలు ఖర్చు చేశాను. ఎంతో కష్టపడి చదివినా ఇప్పటివరకు డీఎస్సీ రాలేదు. దీని వల్ల చాలా నిరుత్సాహంతో ఉన్నాను. ఇటువంటి సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మంగళవారం ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో మెగా డీఎస్సీ, ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని పేర్కొనడం చాలా సంతోషంగా ఉంది.

జాగు, విఘ్నేశ్, శ్రీరాంపురం, పాయకరావుపేట

నారా లోకేశ్‌ను కలిసిన దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 30 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సోమవారం సాయంత్రం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను రత్నాకర్ సత్కరించారు. ప్రస్తుత ఎన్నికల సరళిపై ఇద్దరూ చర్చించుకున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణలపై చర్చించారని రత్నాకర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. మంగళగిరి నియోజకవర్గంలో లోకేశ్ అత్యధిక మెజార్టీతో గెలుస్తారని రత్నాకర్ ఆకాంక్షించారు. ఈయన వెంట పార్టీ నాయకులు శిలపరశెట్టి బాబి ఉన్నారు.



లోకేశ్‌ను సత్కరించిన రత్నాకర్

'మానవత్వం లేని సీఎం జగన్'

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 30 : సీఎం జగన్ సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ విషయంలో మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరుయాదవ్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ విషయమై ఎన్నికల కమిషన్ ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి, సీఎస్ ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ వలంటీర్లు లేకపోతే పంపిణీ సాధ్యం కాదని చెప్పడం దారుణమన్నారు. అందరికీ పింఛన్లు ఇళ్ల వద్దకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని చందనాడలో మంగళవారం దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారికి కుంకుమపూజ, అష్టోత్తర శతనామార్చన, దుర్గాసూక్తం, శ్రీసూక్తం వంటి పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త బొడ్డా నూకరాజు ఆధ్వర్యంలో బొడ్డా రాంప్రసాద్, పలువురు పెద్దలు ఏర్పాట్లను పరిశీలించారు.

జగన్ ఇంటికి వెళ్లిపోవడం తథ్యం

» బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

అచ్యుతాపురం, ఏప్రిల్ 30: త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం ఖాయమని, జగన్ ఇంటికి వెళ్లడం తథ్యమని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. మంగళవారం లంకధర్మవరంలో చెరువు పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రాష్ట్ర స్థాయిలో దోచుకుంటుండగా, ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఇక్కడ భారీగా దోచుకున్నారన్నారు. ఉపాధి కూలీలకు మంచినీరు, మజ్జిగ, వైద్య సదుపాయం వంటి సౌకర్యాలు కల్పించమని కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నా జగన్ రెడ్డి బొక్కేశాడని విమర్శించారు. కూటమి అభ్యర్థులు అధికారంలోకి వస్తే రెండు సెంట్ల భూమి ఇళ్లకు కేటాయిస్తామన్నారు. సెజ్ కర్మాగారాల్లో స్థానికులకు ఉపాధి కల్పించకుండా కర్మాగారాల యాజమాన్యాల నుంచి స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు భారీగా దోపిడీ చేస్తున్నారన్నారు. ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఐదేళ్లలో అక్రమ భూక్రయ, విక్రయాలు జరిపి కోట్లు సంపాదించాడని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కక్కిస్తామన్నారు. దోపిడీదారులు కావాలో, ప్రజల సంక్షేమాన్ని కోరుకునే వారు కావాలో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్, లాలం భవానీ భాస్కర్, రాజాన సన్యాసినాయుడు, జనపరెడ్డి నరసింగరావు, బైలపూడి శ్రీరామదాసు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీఎం రమేశ్

ప్రజారంజక పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

» జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 30 : టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వంతోనే ప్రజారంజక పాలన సాధ్యమవుతుందని జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం మునిసిపాలిటీలోని 21, 22, 23 వార్డుల్లో కూటమి పార్టీల నేతలు, పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సీఎం. రాజేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు విజయకుమార్‌కు హారతులు పట్టారు. తర్వాత సుందరపు ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. అనంతరం ప్రచార రథంపై నుంచి సుందరపు మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి అధినేతలు నడుంబిగించారన్నారు. 13 సంవత్సరాలు నుంచి ప్రజల మధ్యనే ఉంటూ ప్రజాసేవ చేస్తున్నానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అగ్రభాగాన నిలుపుతానన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, తనకు గాజు గ్లాసు గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, మజ్జి కృష్ణ, కొఠారు సాంబ, గొర్లె బాబూరావు, పప్పు ఈశ్వరావు, నక్కా శివశంకర్ పాల్గొన్నారు.



న్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సుందరపు విజయ్‌కుమార్

జగన్‌కు ఓటేసి మోసపోయామని జనం గుర్తించారు

» టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 30: ఒక్క చాన్స్ పేరుతో వైసీపీకి ఓటేసి, మోసపోయామనే నిజాన్ని ప్రజలు గుర్తించారని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం ఉపమాక శివారు మనబాలవానిపాలెం, కొత్రవానిపాలెం, సారిపల్లివానిపాలెం సహా సీహెచ్ఎల్‌పురం తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. టీడీపీ శ్రేణులు, మహిళలు, బీజేపీ, జనసైనికులు ఆయా గ్రామాల్లో అనితకు అపూర్వ స్వాగతం పలికారు. ఈ గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి వారితో మమేకమయ్యారు. ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. మరోసారి నియోజకవర్గం ప్రజలకు సేవ చేసుకునే భాగ్యాన్ని తనకు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, కూటమి నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, వీరబాబు, సత్యనారాయణ, గణేశ్, కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ, పిక్కిస్వామి, జగదీశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.



మనబాలవానిపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న అనిత

పవన్ సభను సక్సెస్ చేయాలి

» జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఏప్రిల్ 30: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ వారాహి యాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం పెందుర్తిలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయవలసిందిగా ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. సుజాతగనగర్‌లోని దాట్ల మాన్షన్‌లో మంగళవారం కూటమి ముఖ్య నాయకులు, జనసేన కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పరవాడ, పెందుర్తి, సబ్బవరం మండలాల నుంచి పెద్దఎత్తున జన సమీకరణ చేయడంపై చర్చించారు. నియోజకవర్గ పరిధిలో సుమారు యాభై వేలకు తగ్గకుండా జనసమీకరణ చేయాలని నిర్ణయించారు. సాయంత్రం నాలుగు గంటలకు పెందుర్తి కూడలిలో బహిరంగ సభ జరుగుతుందని, పవన్‌కల్యాణ్ రాక కోసం సరిపల్లి భాష్యం స్కూల్ సమీపంలో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశామన్నారు. అక్కడ నుంచి ఆయన రోడ్డు మార్గం గుండా సభాస్థలికి చేరుకుంటారన్నారు. హెలిప్యాడ్ నుంచి పవన్‌ను బైక్ ర్యాలీతో జనసైనికులు స్వాగతిస్తారన్నారు. సమావేశంలో కూటమి నాయకులు పీలా శ్రీనివాసరావు, శ్రీనివాసులనాయుడు, సీఎం రమేశ్ సోదరుడు రాజేంద్ర, అయిత సింహాచలం, పిన్నింటి వరలక్ష్మి, గొర్లె రామునాయుడు, మధు, సోమశేఖర్ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

వేపగుంట: ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురానికి చెందిన 25 రజక కుటుంబాలు మంగళవారం నాయుడుతోటలోని భారతి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పంచకర్ల సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే తమ పార్టీలో చేరినట్టు ప్రచారం చేసుకోవడం భావ్యం కాదన్నారు. ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకున్న వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. జనసేనలో చేరిన పలువురు మాట్లాడుతూ కుల సంఘాల సమస్యలపై ఎమ్మెల్యేను కలిసేందుకు వెళితే తమపై బలవంతంగా వైసీపీ కండువాలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, నాయకులు గంగ వరహాలు, కర్రి నూకరాజు, ఎర్రా నాగరాజు, ఆదిబాబు, సురేశ్, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన రజక కుటుంబాలతో పంచకర్ల రమేశ్‌బాబు

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

» టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ

పరవాడ, ఏప్రిల్ 30 : సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ల విజయానికి కార్యకర్తలంతా శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి స్థానిక కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా సర్వనాశనమైపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌కు చెక్ పెట్టేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ సందర్భంగా బాబ్జీని టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, అనకాపల్లి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరి వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, బొండా సన్నిదేముడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, కూండ్రపు మధు, మచ్చా శివకుమార్, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గండి బాబ్జీని సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి

» సీఎం రమేశ్ సోదరీమణులు విజయ, మాధవి

కోటవురట్ల, ఏప్రిల్ 30 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనితకు ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎం.రమేశ్ సోదరీమణులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని చూడువాడలో ఉపాధి కూలీలను కలుసుకున్న సీఎం.రమేశ్ సోదరీమణులు విజయ, మాధవితో పాటు చరణ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఈ ప్రభుత్వాలతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీను, బీజేపీ మండల అధ్యక్షుడు పైలు కనకరాజు, నాయకులు సుంకర బాబ్జి, చౌదరి, సఖిరెడ్డి శివ, చిట్టిబాబు, కొనగల నూకరాజు, కుప్పిన శివ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలకు జగన్ తూట్లు'

సబ్బవరం, ఏప్రిల్ 30 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తూట్లు పొడిచారని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ బావ భాస్కరనాయుడు అన్నారు. మండలంలోని పైడివాడ అగ్రహారంలో మంగళవారం నరసింహరాజు చెరువులో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు ఇవ్వాల్సిన గునపం, పార, మజ్జిగ, టెంట్లు వంటి సదుపాయాలను ముఖ్యమంత్రి జగన్ కల్పించలేదని ఆరోపించారు. జల్‌జీవన్ మిషన్ పథకాన్ని పక్కదోవ పట్టించి ప్రజలకు తాగునీటిని కూడా వైసీపీ ప్రభుత్వం అందించలేదన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే కూటమి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు సీరం అప్పలరాజు, బి. అప్పలరాజు, సురేశ్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా కుష్బూ ప్రచారం



కశింకోటలో ప్రచారం చేస్తున్న సినీనటి కుష్బూ

కశింకోట, ఏప్రిల్ 30: కూటమి అభ్యర్థులకు మద్దతుగా సినీనటి, భారత మహిళా కమిషన్ సభ్యురాలు కుష్బూ మంగళవారం కశింకోటలో ప్రచారం చేశారు. టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు పెదపాటి కళ్యాణి ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన ప్రచారం ఆఫీసర్స్ కాలనీ, మెయిన్‌రోడ్డు, కస్పావీధి, గాడి వీధి, దొరకొండ్డి వీధి గుండా కశింకోట గ్రామ పురవీధుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా కుష్బూ మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణలకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీఎం రమేశ్ రాజ్యసభ సభ్యుడుగా రాజకీయ అనుభవం ఉన్నవాడని, ఆయనను గెలిపిస్తే క్యాబినెట్ మంత్రి హోదాలో అనకాపల్లిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు వేగి గోపీకృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, బుదిరెడ్డి మోహన్, తాకాశి కృష్ణ, కొండబాబు మాస్టారు పాల్గొన్నారు.

వైభవంగా బోయమాంబ పండగ

పరవాడ, ఏప్రిల్ 30: పి.బోనంగి పంచాయతీ వీఎల్ఎన్‌పురం బోయమాంబ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. సర్పంచ్ బండారు కల్పన, భర్త రాజశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు డెక్క శ్రీనివాసరావు, స్థానిక నాయకులు బండారు తాతబాబు, బండారు బోయన్న, బండారు కృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించి అనంతరం ఆలయం వద్ద ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు.

పవన్ కల్యాణ్ సభను విజయవంతం చేయండి

పరవాడ, ఏప్రిల్ 30: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వారాహి యాత్రలో భాగంగా పెందుర్తిలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న కోరారు. మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతోపాటు కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వీజేపాలెంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రచారం

కొత్తూరు, ఏప్రిల్ 30: అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే మహాలక్ష్మి పథకం కింద ప్రతి పేద మహిళ ఖాతాలో ఏడాదికి లక్ష రూపాయలు జమ చేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. సమావేశంలో దళిత సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి ఎగ్గాడ భాస్కర్, క్వారీ, కార్మిక సంఘ నాయకులు పడాల ఈశ్వరరావు, చెక్క రాంబాబు, అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్‌కుమార్, యూత్ నాయకుడు కొల్లి సత్యారావు పాల్గొన్నారు.

'వారాహి యాత్రను విజయవంతం చేయండి'

రాంబిల్లి, ఏప్రిల్ 30 : అచ్యుతాపురంలో బుధవారం జరిగే జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరీ యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్రకార్యదర్శి ధూళి రంగనాయకులు, జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్న దొర పిలుపునిచ్చారు. మంగళవారం హరిపురం జనసేన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాన్ని పవన్‌కల్యాణ్ వివరిస్తారన్నారు. ఎమ్మెల్యే కన్నబాబురాజు ఎలమంచిలి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, చంద్రబాబునాయు డు ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల యువనాయకులు కిలాడ చినబాబు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట శివాలయానికి రూ.లక్ష విరాళం



కమిటీ ప్రతినిధులకు రూ.లక్ష అందజేస్తున్న అప్పారావు

ఎలమంచిలి, ఏప్రిల్ 30: పట్టణంలోని కొత్తపేట రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులకు మంగళవారం రాంబిల్లి మండలం దిమిలి ఎల్ఐసీ ఏజెంట్ శానాపతి అప్పారావు రూ.లక్ష 1116 విరాళంగా అందజేశారు. తన తండ్రి కన్నయ్యనాయుడు జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణ అభివృద్ధికి అందజేశానని అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజాన సూర్యనాగేశ్వరరావు, నానేపల్లి సుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, మిలట్రీ కాలనీల్లో కొళాయిలు బంద్

» తాగునీటికి ఇబ్బంది పడిన ప్రజలు



కొత్తపేటలో కొళాయిల వద్ద ఉన్న బిందెలు

ఎలమంచిలి, ఏప్రిల్ 30: పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు మాత్రం తీరడం లేదు. మంగళవారం కొత్తపేట, మిలట్రీకాలనీ ప్రాంతాల్లో తాగునీటి కొళాయిల నుంచి నీటి సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పైపులైను మరమ్మతుకు గురవ్వడంతో ఈ సమస్య తలెత్తినట్టు తెలిసింది. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా మునిసిపాలిటీలో అమలుకు నోచుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొళాయిల నీటి సరఫరా నిలిచిపోవడంతో కనీసం ట్యాంకర్ల ద్వారా కూడా తాగునీటిని మునిసిపల్ అధికారులు సరఫరా చేయలేదు. తాగునీటి సరఫరా విషయంలో మునిసిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరి మానుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి జిల్లా హాకీ వేసవి శిక్షణ శిబిరం

ఎలమంచిలి, ఏప్రిల్ 30: స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో మే 1 నుంచి జిల్లా హాకీ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కొఠారు నరేష్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఆడారి వీరునాయుడు పర్యవేక్షణలో కోచ్‌ల సమక్షంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో తాళ్లమ్మ అమ్మవారి జాతర

ఎలమంచిలి, ఏప్రిల్ 30: మండలంలో మూడు గ్రామాల్లో తాళ్లమ్మ అమ్మవారి జాతర మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పురుషోత్తపురం, కొత్తలి, పోతురెడ్డిపాలెం గ్రామాల్లో అమ్మవారి జాతరను ప్రతి ఏటా ఏకకాలంలో జరుపుకోవడం ఆనవాయితీ. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలకు తెల్లవారు నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలతో పాటు పరిసర ప్రాంతాలను విద్యుత్ వెలుగులతో అలంకరించారు.

పింఛన్ డబ్బులు పడకపోతే ఆందోళన చెందవద్దు

» మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు

నర్సీపట్నం, ఏప్రిల్ 30: పట్టణ పరిధిలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ రోగులకు ప్రతి నెలా ఇచ్చే పింఛన్ సొమ్మొ బ్యాంకు ఖాతాలలో నేరుగా జమ చేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒకవేళ పింఛను సొమ్ము బ్యాంకుల్లో జమ కాకపోతే ఆందోళన చెందే పని లేదని స్పష్టం చేశారు. ఒకటి రెండు రోజుల్లో లబ్ధిదారుల ఇంటి వద్దకు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛను సొమ్ము పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. మునిసిపాలిటీలో 7248 మంది లబ్ధిదారులకు రూ.2.18 కోట్లు మంజూరయ్యాయన్నారు. వీరిలో 5443 మందికి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామని, మిగిలిన 1805 మందికి సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి ఇస్తారని ఆయన తెలిపారు. బ్యాంకు ఖాతాలో పింఛను సొమ్ము పడకపోతే ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.



ఎన్ఆర్ఐ ప్రతినిధులతో కలిసి మాట్లాడుతున్న అయ్యన్న

'ఎన్ఆర్ఐల కృషి అభినందనీయం'

నర్సీపట్నం, ఏప్రిల్ 30: టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్ఆర్ఐల కృషి అభినందనీయమని నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం ఎన్ఆర్ఐలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు ఇప్పించడానికి ఎన్ఆర్ఐలు వాగ్దానం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు చలసాని కిశోర్, కాంట్రగడ్డ కృష్ణప్రసాద్, పల్లేటి రాజేశ్ బాబు, బి.యాష్, డాక్టర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

పింఛన్ డబ్బులు పడకపోతే ఆందోళన పడకండి

బ్యాంకులో జమకాని వారికి ఇంటికి వచ్చి ఇస్తాం

మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు

నర్సీపట్నం, ఏప్రిల్ 30: పట్టణ పరిధిలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ రోగులకు ప్రతి నెలా ఇచ్చే పింఛన్ సొమ్మొ బ్యాంకు ఖాతాలలో నేరుగా జమ చేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒకవేళ పింఛను సొమ్ము బ్యాంకుల్లో జమ కాకపోతే ఆందోళన చెందే పని లేదని స్పష్టం చేశారు. ఒకటి రెండు రోజుల్లో లబ్ధిదారుల ఇంటి వద్దకు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛను సొమ్ము పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. మునిసిపాలిటీలో 7248 మంది లబ్ధిదారులకు రూ.2.18 కోట్లు మంజూర య్యాయన్నారు. వీరిలో 5443 మందికి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామని, మిగిలిన 1805 మందికి సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి ఇస్తారని ఆయన తెలిపారు. బ్యాంకు ఖాతాలో పింఛను సొమ్ము పడకపోతే ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

నేడు పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం

నర్సీపట్నం, ఏప్రిల్ 30: అసెంబ్లీ ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులతో ఎన్నికల వ్యయ పరిశీలికుడు సంజయ్ గాంధీ మూడు విడతలగా సమావేశం నిర్వహిస్తున్నారని నర్సీపట్నం రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పోటీ చేస్తున్న అభ్యర్థులతో సబ్ కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం మొదటి విడత మీటింగ్ ఉంటుందన్నారు. అదే విధంగా 6, 10 తేదీలలో కూడా సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు విధిగా హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

గొలుగొండ, ఏప్రిల్ 30: మండలంలోని మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డివిజనల్ ఇంజనీర్ వీడీవీ.రామకృష్ణ తెలిపారు. మండలంలోని 33/11కెవీ విద్యుత్ లైన్ కింద జంగిల్ క్లిరెన్స్ చేపడుతున్నట్టు చెప్పారు. బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలవరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. బలిఘట్టం నుంచి గొలుగొండ, కృష్ణాదేవిపేట, ఏటిగైరంపేట గ్రామాల్లో గల విద్యుత్ సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ఈ సమాచారాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు

నేటి నుంచి యోగా శిక్షణ శిబిరం

చోడవరం, ఏప్రిల్ 30: బాలబాలికలకు మే 1 బుధవారం నుంచి యోగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు స్థానిక పతంజలి యోగా శిక్షణ కేంద్రం డైరెక్టర్ పుల్లేటి సతీష్ తెలిపారు. విద్యార్థులకు చదువులో ఏకాగ్రత, ఆరోగ్యం, ఆధ్యాత్మిక పరంగా ఉపయోగపడేలా ఈ శిక్షణ ఉంటుందని, ఈ శిబిరం స్థానిక ఉషోదయ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తిగల వారు ఫోన్: 9291276900 సంప్రదించాలని కోరారు. నెలరోజుల పాటు రోజూ ఉదయం 7నుంచి 8గంటల వరకు శిక్షణ అందిస్తామన్నారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 30: గొర్లెపాలెంలో పేకాట శిబిరంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాటాడుతున్న నలుగురును అ రెస్టు చేసి, రూ.2,730, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా వేళలో మార్పు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 30: వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం నుంచి త్రీ ఫేస్ విద్యుత్‌ను ఉదయం 5 నుంచి 12 గంటల వరకు సరఫరా చేయనున్నట్టు ఏఈఈ సోమరాజు తెలిపారు. నేటి వరకు 6 నుంచి 1 గంట వరకు సరఫరా చేసేవారమని, ప్రస్తుతం చేసిన మార్పును గుర్తించాలని వినియోగదారులను కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

రోలుగుంట, ఏప్రిల్ 30 : మండలంలోని ఎంకేపట్నం పంచాయతీలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ రాజు మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు మద్దు పైడితల్లినాయుడు ఆధ్వర్యంలో సింగరాజుపేట, పెదపేట, చటర్జీపురం, ఎంకెపట్నంకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. పలువురునాయకులు పాల్గొన్నారు.



దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్

మాకవరపాలెం, ఏప్రిల్ 30: మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చి ఐదేళ్లరాష్ట్ర సంపదను దోచుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని బూరుగుపాలెం, గిడుతూరు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. వైసీపీకి ఓటు వేసి ఎవ్వరూ వృథా చేయకూడదని కోరారు. మోదీ, చంద్రబాబు, పవన్ త్రిమూర్తులకు పట్టంకడితే ఏపీ హ్యాపీగా ఉంటుందన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తానని సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు యువత మరింత బాగుపడాలంటే కూటమి అధికారంలోకి రావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే బోళం ముత్యాలపాప, టీడీపీ నాయకులు చినబాబు, బుచ్చిరాంప్రసాద్, కేతిరెడ్డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

సాదాసీదాగా మండల సమావేశం

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 30: మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి పనులపై సమీక్ష జరగలేదు. ముందుగా ఎంపీపీ రాజేశ్వరి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతం వాతావరణంలో జరిగే విధంగాఅన్ని రాజకీయ పార్టీల సహకరించాలని కోరారు. వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బోళెం రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండలు తీవ్రంగా వున్నాయని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో జాన్‌లింకన్ స్పందిస్తూ దీనిపై తగిన చర్యలు చేపడతామని సభకు హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో గ్రామ సచివాలయాల్లో కుర్చీల్లో కూర్చోవచ్చా అని పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీడీవోను ప్రశ్నించారు. సచివాలయాలకు వెళ్లిన ప్రజా ప్రతినిధులు రాజకీయాల చర్చలు జరపకూడదని ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు ఇన్నం రత్నం, కూండ్రపు తాతబాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న సీఎం సతీశ్ సతీమణి

కూటమి అభ్యర్థులను గెలిపించండి

▸▸ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి

మాడుగుల, ఏప్రిల్ 30 : పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు టీడీపీ, బీజేపి, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించేలా ఓటు వేయాలని ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మాడుగుల కేంద్రం మోదమాంబ, నిర్మలకాలనీ, బస్టాండ్ ప్రాంతాల్లో ఆమె ఇం టిం టి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ గుర్తు కమలం, ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి గుర్తుసైకిల్ పై ఓటువేసి గెలిపించాలని కోరారు. కూటమి అభ్యర్థుల గెలుపుతో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. సక్షేమపథకాలు చేరువ అవుతాయన్నారు. వైసీపీ పాలనలో అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆమెతోపాటు బీజేపి, టీడీపీ, జనసేన నాయకులు సంతోషి సుబ్బలక్ష్మి, గౌరీపట్టపు జగన్నాధరావు, రొబ్బా మహేష్, పుట్టా నానాజీ ఈ ప్రచారంలో పాల్గొన్నారు.

13 నెలలుగా వేతనాలు అందక అగచాట్లు

▸▸ రావికమతంలోని అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందులు

▸▸ కుటుంబాలతో అర్థాకలితో జీవనం

రావికమతం, ఏప్రిల్ 30: గర్నికం (రావికమతం) అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి గత 13 నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ కేంద్రం 2007లో ప్రారంభమైంది. ప్రైవేట్ సంస్థ (అవుట్ సోర్సింగ్) విధానంలో కొనసాగుతోంది. రావికమతం, బుచ్చియ్యపేట, రోలుగుంట మూడు మండలాల పరిధిలో ఎక్కడ ప్రమాదాలు సంభవించినా సమాచారం అందిన వెంటనే సిబ్బంది వెళ్లి నివారణ చర్యలు చేపడతారు. అరకొర సౌకర్యాలున్నా ఇక్కడి సిబ్బంది సేవల్లో జిల్లాలోనే ఉత్తమ గుర్తింపుపొందారు. అయితే, జీతాలందక కుటుంబాలతో పస్తులతో పని చేయాల్సి వస్తుందని సిబ్బంది వాపోతున్నారు. 2023 మార్చి నుంచి ఇప్పటి వరకూ ఒక్కొక్కరికి నెలకి రూ.6,545 చొప్పున 16 మందికి నెలకి రూ. 1.4720 చొప్పున 13 నెలలకు మొత్తం రూ.13.61లక్షల మేర వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే బకాయిలు పెరిగిపోయి కనీసం కిరాణా సరకులు కూడా షాపు యజమానులు ఇవ్వడంలేదని సిబ్బంది వాపోతున్నారు. ఇకనైనా తమకు బకాయి వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



రావికమతం అగ్నిమాపక కేంద్రం

కూటమి మేనిఫెస్టోతో మహిళల అభివృద్ధి

▸▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 30: టీడీపీ కూటమి మేనిఫెస్టో మహిళల సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తుందని అనకాపల్లి టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పేర్కొన్నారు. ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం తురకలపూడి ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ మేనిఫెస్టోలో సామాజిక పింఛను రూ.4వేలకు పెంపు, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ. 1500, తల్లికి వందనం కింద చదువుకుంటున్న పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15వేలు, డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, రైతులకు ఏడాదికి రూ.20 వేలు, భూహక్కు చట్టం రద్దు, తదితర సంక్షేమ పథకాలు పేదల కలల సాకారం చేయనున్నాయన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే కూటమి లక్ష్యమన్నారు. ప్రజల భూములను కబ్జా చేసే ప్రయత్నంలో భాగంగానే జగన్ ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్ట్ 2023 తెచ్చిందని ఆరోపించారు. ఒక్కఛాన్సు ఇచ్చినందుకు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చోడవరం నియోజకవర్గం అభివృద్ధిని తుంగలో తొక్కారని మండిపడ్డారు. కూటమి విజయంతోనే వైసీపీ అరాచక పాలన అంతం సాధ్యపడుతుందన్నారు. కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గేదెల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, పీవీఎస్ఎన్. రాజు, సీతా నాగరాజు, కోరుకొండ రవికుమార్, వియ్యపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తురకలపూడి ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తాతయ్యబాబు

చెరకు బకాయిలు రూ.9.92 కోట్లు చెల్లింపు

▸▸ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం, ఏప్రిల్ 30: గోవాడ సహకార షుగర్ ఫ్యాక్టరీకి గత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు పక్షం రోజుల పేమెంట్ రూ 9.92కోట్లు నేరుగా వారి ఖాతాలకు మంగళవారం నుంచి జమ చేస్తున్నట్టు ఫ్యాక్టరీ ఎండీ వి. సన్యాసినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఫ్యాక్టరీలో ఈ ఏడాది లక్షా 70వేల 601 టన్నుల చెరకు క్రషింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. చెరకు సరఫరా చేసిన లక్షా 70వేల 601టన్నులకు గాను, తొలివిడతలోగత ఏడాది డిసెంబరు 29నుంచి ఈ ఏడాది జనవరి 14 వరకూ సరఫరా చేసిన 34వేల 894 టన్నులకు గాను టన్నుకు రూ.2500 చొప్పున 8కోట్ల 72 లక్షల రూపాయలు చెల్లించామని తెలిపారు. రెండో విడత కింద జనవరి 15 నుం చి జనవరి నెలాఖరు వరకూ సరఫరా చేసిన 34వేల 747 టన్నులకు మరో రూ.8 కోట్ల 68లక్షల 69వేల రూపాయలు ఈనెల మొదటివారంలో జమ చేసినట్టు వివరించారు. కాగా, మూడో విడతగా ఫిబ్రవరి 1నుంచి ఫిబ్రవరి 15 వరకు సరఫరా చేసిన 39వేల 691 టన్నులకు గాను రూ.9 కోట్ల 92లక్షల రూపాయలు మంగళవారం నుంచి చెల్లింపు చేపట్టామన్నారు. మిగిలిన రైతులకు కూడా త్వరగా చెల్లించడానికి చ ర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వచ్చే సీజన్‌కు చెరకు మద్దతు ధర ట న్నుకు రూ. 3151 ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.



గోవాడ షుగర్స్ ఎండీ సన్యాసినాయుడు

'అభివృద్ధి చూసి ఓట్లు వేయాలి'

చీడికాడ, ఏప్రిల్ 30: రాష్ట్రంలో సీఎం జగన్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసీపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి కోరారు. మండలంలో శిరిజాం, కోనాం, మంచాల పంచాయతీల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సం దర్భంగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకి, ఎమ్మె ల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధలను గెలిపించాలని కోరారు. జగన్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాడు గుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ, ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీ టీసీ సభ్యురాలు లాలం శారదావరలక్ష్మి, నాయకులు గొల్లవిల్లి రాజబాబు, గొల్లవిల్లి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

దేవరాపల్లి, ఏప్రిల్ 30: మండల సర్వ సభ్య సమావేశం మే 6వతేదీన జరగనుందని ఎంపీడీఓ సుబ్బలక్ష్మి తెలిపారు. ఎన్నికల నిబంధనలు లోబడి ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు.. మరోవైపు విద్యుత్ కోతలు

▸▸ ఆపసోపాలు పడుతున్న వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు

మాడుగుల, ఏప్రిల్ 30: ఎండతీవ్రతకు జనాలు ఆపసోపాలు పడుతున్నారు. ఉదయం 9గంటల నుంచే ఉష్ణో గ్రతలు అధికంగా నమోదవడంతోపాటు వడగాల్పులు వీస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇళ్లల్లో ఉన్న వృద్ధులు, గర్భిణులు, పసిపిల్లలు ఉక్కపోత భరించలేకున్నారు. దీనికి తోడు విద్యుత్ కోతులు అధికమవుతున్నాయి. ఇళ్లల్లో ఫ్యాన్లు తిరగక బయలకు వెళ్లలేక జనాలు ఆపసోపాలు పడుతున్నారు.

మాడుగుల రూరల్: ఉదయం పది గంటలకే ఎండ జోరందుకుంటోంది. సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతున్నది. తర్వాత ఎండ తగ్గినా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మధ్యాహ్న సమయాల్లో రోడ్లపై రావాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లలో ఫ్యాన్ల కింద సేదదీరినా చెమట ఆగడంలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వచ్చే రోహిణి కార్తెల్లో ఎండతీవ్రత ఇంకెంత భయంకరంగా ఉంటుందోనని తల్లడిల్లిపోతున్నారు.



నిర్మానుష్యంగా మారిన మాడుగులలో రహదారి

జనరంజకం

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేసిన వారికి డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం లేదు. టీడీపీ హయాంలో ఇచ్చిన నిరుద్యోగ భృతిని నిలిపివేశారు. వీరందరికీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో ఊరట కలిగించింది. రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అప్పటివరకూ నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి, దానికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. వీటివల్ల ఎన్నో లక్షల కుటుంబాలకు మేలు జరుగుతుంది.

చెత్త పన్ను రద్దు..ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు

దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్మోహన్‌రెడ్డి చెత్తపై పన్ను వేశారు. కూటమి అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేస్తామని చంద్రబాబునాయుడు వెల్లడించారు. అదేవిధంగా ల్యాండ్ టైట్లింగ్ చట్టం తీసుకువచ్చింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ చట్టాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఇంటింటికీ పథకం

ప్రతి ఇంటికీ అన్నిరకాల పథకాలు అందేలా చంద్రబాబు మేనిఫెస్టో రూపొందించారు. రక్షిత నీటి కోసం ప్రతి ఇంటికి కుళాయి వేయిస్తామని చంద్రబాబు ప్రకటించారు. గ్యాస్ సిలెండర్ల ధరలు భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో ఆర్థిక భారం తగ్గించేందుకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలు జిల్లా పరిధిలో ఎక్కడికి బస్సులో వెళ్లినా టికెట్ తీసుకోవలసిన అవసరం లేదని, ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామన్నారు. ఇంటి పైకప్పుపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా బిల్లుల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు.

మహిళకు వందనం

ప్రతి మహిళకు 19 నుంచి 59 ఏళ్ల వారికి నెలకు రూ.1,500 ఇస్తామన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.18,500 మాత్రమే ఇస్తోంది. అది కూడా 45 ఏళ్లు దాటిన వారికి 'చేయూత' పేరుతో ఇస్తోంది. చంద్రబాబునాయుడు అలా కాకుండా 19 ఏళ్ల నుంచి ఈ పథకం వర్తింపజేయనున్నారు. నెల నెలా డబ్బులు అందుతాయి. ఇంకా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద రూ.1,500 అందిస్తామని ప్రకటించారు. వృద్ధాప్య పెన్షన్ రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంపు, తల్లికి వందనం కింద ఏడాదికి ఒక్కో బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి అందించనున్నట్టు తెలిపారు. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలు, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తామని, బీసీల కోసం రక్షణ చట్టాన్ని తేనున్నట్టు ప్రకటించారు. అందరికీ గూడు నినాదంతో పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం అందించడమే కాకుండా నాణ్యమైన ఇల్లు నిర్మిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ ఉచిత మంచినీటి కొళాయిల ఏర్పాటు, చేనేతకు 200 యూనిట్లు, మర మగ్గాలుంటే 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచేది లేదని స్పష్టం చేశారు.

మత్స్యకారులకు రూ.20 వేలు

ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులకు ఏడాకి రూ.10 వేలు మాత్రమే లబ్ధి అందిస్తోంది. చేపల వేట నిషేధ సమయంలో 45 రోజులకు భృతి కింద ఈ మొత్తం ఇస్తోంది. చంద్రబాబునాయుడు దీనిని రెట్టింపు చేసి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో మత్స్యకారులందరికీ దీని వల్ల మేలు జరుగుతుంది.

కుటుంబానికి ఆర్థిక దన్నుగా ఉంటుంది

- పైలా పావని, గృహిణి, పరవాడ



స్వయం సహాయక సంఘాలకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తామని టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో ప్రకటించడం శుభపరిణామం. దీని వల్ల మాలాంటి కుటుంబాలకు ఆర్థిక దన్నుగా ఉంటుంది. మహిళలకు ఆర్థికంగా భరోసా ఉంటుంది. డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతమవుతాయి.

మెగా డీఎస్సీ వల్ల ఎందరికో మేలు

- జాగు, విఘ్నేశ్, శ్రీరాంపురం, పాయకరావుపేట



జగన్ ప్రభుత్వం డీఎస్సీ ప్రకటిస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూశాను. డీఎస్సీ ప్రిపరేషన్‌లో భాగంగా ఇప్పటివరకు రూ.2 లక్షలు ఖర్చు చేశాను. ఎంతో కష్టపడి చదివినా ఇప్పటివరకు డీఎస్సీ రాలేదు. దీని వల్ల చాలా నిరుత్సాహంతో ఉన్నాను. ఇటువంటి సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మంగళవారం ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో మెగా డీఎస్సీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని పేర్కొనడం చాలా సంతోషంగా ఉంది.

నిరుద్యోగులకు ఎంతో మేలు

- చక్రధర మహంతి సాయిప్రసాద్, మాడుగుల



కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలోని అంశాలు చాలా బాగున్నాయి. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది.

చంద్రబాబుతోనే బీసీల సాధికారత

- గుడూరు రమణ, ఎల్‌బీపీ అగ్రహారం



చంద్రబాబుతోనే బీసీల సాధికారత సాధ్యమవుతుందని కూటమి ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా మరోమారు తేటతెల్లమైంది. బీసీ డిక్లరేషన్ ద్వారా 50 ఏళ్లకే నెలకు రూ.4 వేల పింఛన్, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, సబ్ ప్లాన్ ద్వారా లక్షన్నర కోట్ల రూపాయిల ఖర్చు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ కేటాయించడం గొప్ప విషయం.

చాలా సంతోషంగా ఉంది

- కొమ్మనమంచి నరసింహమూర్తి. ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ కో- ఆర్డినేటర్



కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలో బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరణకు హామీ ఇవ్వడం చాలా సంతోషం. అర్చకులు, పురోహితులకు మేలు చేసే విధంగా ఉంది. బ్రాహ్మణుల ఓట్లు తప్పనిసరిగా కూటమి అభ్యర్థులకే వేస్తాం.

పశువులకు వింతవ్యాధితో రైతుల ఆందోళన



పాడి ఆవుపై శరీరంపై మొటిమలు

మాడుగుల, ఏప్రిల్ 30: పశువులకు వింత వ్యాధి సోకడంతో పాడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవుల చర్మమంతా మొటిమలతో బాధపడుతున్నాయి. ఈనేపథ్యంలో అయోమయ స్థితిలో పాడిరైతులు ఉన్నారు. మండలంలో గొటివాడ అగ్రహారం గ్రామంలో ఓ రైతు పాడి ఆవు చర్మం నల్లని మొటిమలు ఏర్పడ్డాయి. దీంతో ఈ వ్యాధి మిగిలిన జీవాలకు సోకుతుందని పాడి రైతులు ఆందోళ చెందుతున్నారు. పశు సంవర్థక శాఖ అధికారులు గ్రామాల్లో వ్యాధి విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.